మంగళవారం
06-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 225
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

విశాఖ టెస్టులో మనదే విజయం

- 106 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసిన భారత్
- 5మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమం

8లో

ఎంపీలు, ఎమ్మెల్యేలే భయపడుతుంటే
సామాన్యుల సంగతేంటి ?

- ఒకరిపై చర్య తీసుకుంటే తప్ప చక్కబడేలా లేదు
- పోలీసుల తీరుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై సోమవారం హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. టీడీపీ శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణలో భాగంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పోలీసులు అరెస్టు చేస్తారని ఎంపీలు, ఎమ్మెల్యేలే భయపడుతుంటే సామాన్యుల సంగతేంటని ప్రశ్నించింది. ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న కేసుల్లో సెక్షన్ 41ఏ నోటీసు ఇవ్వాలి. అలా వివరణ తీసుకోకుండా అరెస్టుకు ఎలా ప్రయత్నిస్తారు? అని హైకోర్టు ప్రశ్నించింది. అలా చేస్తే బాధ్యులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఎవరో ఒక ఉన్నతాధికారిపై చర్యలకు ఆదేశిస్తే తప్ప పరిస్థితి చక్కబడేట్లు లేదంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. దీనిపై వివరాల సమర్పణకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరగా, తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం మంగళవారానికి వాయిదా వేసింది.

అవినాష్‌రెడ్డి బెయిల్ రద్దుపై విచారణ వాయిదా

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మరోసారి వాయిదా పడింది. ఏప్రిల్ మూడో వారంలో కేసు తుది వాదనలు వింటామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. ఏప్రిల్ 22కి ముందు కేసు విచారణకు తీసుకునే పరిస్థితి లేదని స్పష్టం చేసింది. ఈలోపు కేసు డైరీ మొత్తాన్ని కోర్టు ముందు ఉంచాలని ఆదేశించగా, అది 60 భాగాలుగా ఉందని సీబీఐ తరపు న్యాయవాది తెలిపారు. అయితే వాటిని డిజిటల్ రూపంలోకి మార్చి ఈ-డైరీ సమర్పించాలని ఆదేశించింది. అవినాష్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు విషయం తెలిసిందే.

నవరత్నాలతో సమగ్రాభివృద్ధి

- విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు
- ప్రతి హామీ అమలుపరిచాం
- అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు మహత్తరం
- మహిళా సంక్షేమానికి పెద్దపీట
- అభివృద్ధి వేగం కొనసాగేందుకు మద్దతివ్వాలి
- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలోనే ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేరుతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాల జీవన ప్రమాణస్థాయి అనూహ్యంగా పెరగడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిపై ఆ ప్రభావం స్పష్టంగా కనపడుతోందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన వర్గాల ప్రయోజనం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని వివరించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 18.181 ఎకరాల సువిశాల ప్రాంగణంలో రూ.404.35 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు మహత్తర ఘట్టంగా పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, సాధికారత పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఈ విగ్రహం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, అభ్యసన ఫలితాలు, పౌష్టికాహారం, మహిళల్లో రక్తహీనత వంటి కొన్ని సామాజిక అంశాల్లో ఏపీ వెనుకబడి ఉందని గ్రహించిన తమ ప్రభుత్వం నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేసి సామాజిక, ఆర్థిక, విద్యా సాధికారితపై దృష్టి సారించిందని గవర్నర్ వివరించారు. దీనిలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా సంస్కరణలు అమలు చేసి పేద పిల్లలకు గ్లోబల్ ఎడ్యుకేషన్ అందిస్తున్నాం. మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చాం. విద్యారంగంపై

- మిగతా 2 లో

అబద్ధాల పుట్ట
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ 8లో

అన్నీ అసత్యాలే
టీడీపీ నిరసన...వాకౌట్ 8లో

రేపు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్
8లో

ప్రజాస్వామ్యం ఖూనీ
సహించం

- చండీగఢ్ మేయర్ ఎన్నిక తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- కొత్త మేయర్ విధులు నిర్వహించరాదు
- బ్యాలెట్‌పత్రాలు, వీడియో భద్రపర్చాలని హైకోర్టుకు ఆదేశం
- 12న తదుపరి విచారణ

న్యూఢిల్లీ: అత్యంత వివాదాస్పదమైన చండీగఢ్ మేయర్ ఎన్నిక వ్యవహారంపై దేశ అత్యున్నత న్యాయస్థానం నిప్పులు చెరిగింది. ఘాటు విమర్శలు చేసింది. అదే తీవ్రతతో కీలక వ్యాఖ్యలు చేసింది. కొత్త మేయర్ సారథ్యంలో ఎలాంటి సమావేశాలను కూడా నిర్వహించకూడదని ఆదేశాలను జారీ చేసింది. మేయర్ ఎన్నికలను నిర్వహించిన రిటర్నింగ్ అధికారిపై సుప్రీంకోర్టు మండిపడింది. రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. 'ఎన్నికల నిర్వహణ తీరు ఇదేనా? ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. ఇది ప్రజాస్వామ్యం హత్యే. ఆయనపై విచారణ జరపాలి' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇటీవలే చండీగఢ్ మేయర్ ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ సీనియర్ నేత మనోజ్ సోంకర్ చండీగఢ్ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ- కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి కుల్‌దీప్ సింగ్‌ను నాలుగు ఓట్ల తేడాతో ఓడించారు. చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న మొత్తం సంఖ్యాబలం 35. కౌన్సిలర్లుగా ఎన్నికైన వారిలో బీజేపీ-14, ఆమ్ ఆద్మీ పార్టీ-13, కాంగ్రెస్-7, శిరోమణి అకాలీదళ్‌కు

- మిగతా 2 లో

విశ్వాస పరీక్షలో
చంపై ప్రభుత్వం విజయం

47 మంది ఎమ్మెల్యేలు అనుకూలం, 29 ప్రతికూలం

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపై సోరెన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో విజయం సాధించింది. రాష్ట్ర అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టిన 'విశ్వాస తీర్మానం' గెలిచింది. సభలో ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 47, వ్యతిరేకంగా 29 ఓట్లు పడ్డాయి. దీంతో జార్ఖండ్ సర్కార్ మనుగడకు అడ్డంకులు తొలగిపోయాయి. దీనికి ముందు ముఖ్యమంత్రి చంపై సోరెన్ అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. భూకుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేసిన

- మిగతా 2 లో

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా: హేమంత్
2లో

'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే
50 శాతం కోటా పరిమితి ఎత్తేస్తాం

- దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తాం
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

రాంచీ: లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో 'ఇండియా' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే దేశ వ్యాప్తంగా కుల గణన చేపడతామని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి గిరిజనుడు కావడంతో జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్-ఆర్‌జేడీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నించిందని విమర్శించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ కుట్రను అడ్డుకుని పేదల ప్రభుత్వాన్ని కాపాడినందుకు (చంపై) సోరెన్ జీ కూటమి ఎమ్మెల్యేలందరినీ అభినందించాలనుకుంటున్నాను' అని గాంధీ అన్నారు. మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర సందర్భంగా ఇక్కడ షహీద్ మైదాన్‌లో జరిగిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు) బానిస కార్మికులుగా మార్చారని, పెద్ద కంపెనీలు, ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు, కోర్టుల్లో వారి భాగస్వామ్యం కొరవడిందని రాహుల్ అన్నారు. 'ఇది భారతదేశం ముందు ఉన్న అతిపెద్ద ప్రశ్న. దేశంలో కుల గణనను చేపట్టడం మా మొదటి అడుగు' అని తెలిపారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఇవ్వలేమని పేర్కొన్న గాంధీ, భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఇండియా) ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తుందని హామీ ఇచ్చారు. 'దళితులు, ఆదివాసీల రిజర్వేషన్లలో ఎలాంటి తగ్గింపు ఉండదు. సమాజంలోని వెనుకబడిన వర్గాల వారి హక్కులను పొందుతారని నేను మీకు హామీ ఇస్తున్నాను. ఇది అతిపెద్ద సమస్య సామాజిక, ఆర్థిక అన్యాయం' అని గాంధీ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ తాను ఓబీసీ అని చెప్పుకునేవారని, అయితే కులాల గణన కోసం డిమాండ్ వచ్చినప్పుడు ధనిక, పేద అనే రెండు కులాలు మాత్రమే ఉన్నాయని తెలిపారని అన్నారు. 'బీసీలు, దళితులు, గిరిజనులకు హక్కులు కల్పించాల్సిన సమయం వచ్చినప్పుడు కులాలు లేవని మోదీజీ అంటున్నారని, ఓట్లు రాబట్టే సమయం వచ్చినప్పుడు తాను ఓబీసీ అని అంటున్నారని గాంధీ విమర్శించారు. జార్ఖండ్ అసెంబ్లీలో చంపై సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గెలిచిన వెంటనే బీజేపీపై విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ... గిరిజన సీఎంను అంగీకరించలేనందున ప్రభుత్వాన్ని తొలగించాలని బీజేపీ ప్రయత్నించిందన్నారు. కాంగ్రెస్, జేఎంఎం కలిసి వారికి

- మిగతా 2 లో

ఆప్ నేత ప్రమాణాన్ని అడ్డుకున్న ధన్కర్

న్యూఢిల్లీ: జైలులో ఉన్న ఆప్ నేత సంజయ్ సింగ్ సోమవారం రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయలేక పోయారు. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్... సంజయ్ సింగ్ ప్రమాణానికి నిరాకరిం చారు. ప్రివిలెజ్ కమిటీ ఆయనపై విచారణ జరుపుతోందని ధన్కర్ వెల్లడించారు. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో సంజయ్ సింగ్ అరెస్టయిన సంగతి తెలిసిందే. అయితే ఆయనను ఆప్ మరోసారి రాజ్యసభ ఎంపీగా నామినేట్ చేసింది. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసేందుకు, పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు తనకు ఏడురోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఫిబ్రవరి ఒకటిన సంజయ్... ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. తర్వాత తన పిటిషన్‌ను వెనక్కి తీసుకొని... ప్రమాణ స్వీకారానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అందుకు కోర్టు అంగీకరించింది. సంజయ్‌సింగ్‌ను పార్లమెంటుకు తీసుకెళ్లాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. ప్రమాణ స్వీకారం కోసం వచ్చిన ఆయనకు నిరాకరణ ఎదురైంది.

ఇదీ లోకం!

మన స్కూల్‌లో నేర్చుకున్న పద్యం సార్.. చెప్పులోన రాయి.. చెవులోన జోరీగ ఇంటిలోని పోరు..

మా జీవితాలు సర్వనాశనం

- డీఎస్సీ అభ్యర్థుల ఆవేదన
- కాంగ్రెస్, జనసేన నేతలకు వినతులు
- 20 వేల పోస్టులతో మెగా డీఎస్సీకి డిమాండ్

2లో

ప్రజల్లో తిరుగుబాటు... జగన్‌ను దించేస్తారు

రా.. కదలిరా... సభల్లో చంద్రబాబు

విశాలాంధ్ర-కె.కోటపాడు/చింతలపూడి: ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైందని, జగన్‌ను ఇంటికి పంపడం ఖాయమని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలంతా తమ వెంటే ఉన్నారని దీమా వ్యక్తం చేశారు. రాష్ట్రమంతా అదే జోరు కనిపిస్తుందన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు, ఏలూరు జిల్లా చింతలపూడిలో జరిగిన రా.. కదలిరా... బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.లక్ష కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. సీఎం జగన్ రూ.12 కోట్ల అప్పులు చేశారని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందే జగన్ ఓటమిని ఆమోదించారని, మొదటి రెండు సంవత్సరాలు నన్ను ఎవరు టచ్ చేయలేరని చెప్పాడని, మూడో సంవత్సరం నన్ను నమ్మండి అన్నారు. నాలుగో సంవత్సరం మిమ్మల్ని నమ్ముకున్నానని అన్నాడని, ఇప్పుడు వచ్చేసరికి ఆనందంగా దిగిపోతానంటున్నాడని ఎద్దేవా చేశారు. ఆయన దిగిపోవడం కాదు... ప్రజలే ఆయన్ని దించేస్తారని చంద్రబాబు తెలిపారు. ప్రజల కోసం బటన్ నొక్కుతున్నానని చెబుతున్నాడని, పది రూపాయలు ఇచ్చి రూ.100 లాక్కుంటున్న సంగతి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికి 9 సార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై 64 వేల కోట్ల రూపాయలు భారం వేసారని ఆరోపించారు. తెలుగుదేశం హయాంలో ఒక్కసారి కూడా కరెంటు చార్జీలు పెంచలేదన్నారు. చెత్త పన్ను, ఆస్తి పన్ను, పెట్రోల్ పన్ను, నిత్యావసర సరుకుల ధరలు పెరగడం ఇవన్నీ బటన్ నొక్కడం వల్లేనని అన్నారు. ప్రతి కుటుంబానికి ఈ ఐదు సంవత్సరాలలో రూ.8 లక్షల భారం పెరిగిందని చెప్పారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్

- మిగతా 2 లో

మే10 నాటికి భారత బలగాలు వెనక్కి

మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

మాలే: రెండు విడతలుగా తమ దేశంలోని భారత బలగాలు వెనక్కి మళ్లుతాయని మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు తెలిపారు. ఈ ఏడాదిలో మాల్దీవుల పార్లమెంట్‌లో తొలి ప్రసంగం చేసిన సందర్భంగా ఆయన ఈ మేరకు వెల్లడించారు. కాగా పార్లమెంటు తొలివిడత సమావేశాల్లో ముయిజ్జు ప్రసంగాన్ని రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించాయి. మార్చి 10 నాటికి తమ దేశంలో ఉన్న భారత సైనికుల మొదటి బృందాన్ని వెనక్కి పంపనున్నట్లు ముయిజ్జు ప్రకటించారు. తమ దేశంలో ఉన్న మూడు వైమానిక స్థావరాల్లో ఒకదానిలో విధులు నిర్వర్తిస్తున్న భారత్ బలగాలు మార్చి 10వ తేదీలోగా వెళ్లిపోతాయని చెప్పారు. మిగతా రెండు స్థావరాల్లో ఉన్న భారత్ దళాలు మే 10వ తేదీ నాటికి పూర్తిగా వైదొలుగుతాయని వెల్లడించారు. ఈ విషయంలో భారత్‌తో ఉన్న ఒప్పందాన్ని తాము పునరుద్ధరించుకోవడం లేదని మయిజ్జు స్పష్టం చేశారు. తమ సార్వభౌమత్వం విషయంలో మరొక దేశం జోక్యాన్ని తాము అనుమతించబోమని తెలిపారు. ఈ బలగాల ఉపసంహరణపై రెండు దేశాలు ఒక అంగీకారానికి వచ్చినట్లు ఇప్పటికే అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. మాల్దీవుల్లో మోహరించిన భారత బలగాలు భారత్ సహకారంతో ఏర్పాటు చేసిన రాడార్ స్టేషన్లు, నిఘా విమానాల నిర్వహణ బాధ్యతలను చూస్తుంటాయి.

అధ్యక్షుడి బహిష్కరించిన రెండు పార్టీలు

భారత వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నట్లు విమర్శలు ఎదుర్కొంటున్న మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుకు నిరసనల సెగ తగిలింది. పార్లమెంటు తొలివిడత సమావేశాల్లో ముయిజ్జు ప్రసంగాన్ని రెండు ప్రధాన విపక్షాలు మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీతో పాటు ద డెమోక్రాట్స్ పార్టీలు బహిష్కరించినట్లు సమాచారం. 56 మంది ఎంపీలు అధ్యక్షుడి ప్రసంగాన్ని బహిష్కరించగా అందులో 13 మంది ద డెమోక్రాట్స్, 44 మంది మాల్దీవియన్ డెమోక్రటిక్‌కు చెందిన పార్లమెంటు సభ్యులు ఉన్నారు. ముయిజ్జు ప్రసంగం సమయంలో కేవలం 24 మంది ఎంపీలే పార్లమెంటుకు హాజరయ్యారు. భారత్‌తో పాటు ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రులను తిరిగి నియమించడానికి వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డెమోక్రాట్స్ ప్రకటించారు. భారత వ్యతిరేక వైఖరిని ఉద్దేశించి ద్వీపదేశ విదేశాంగ విధానంలో మార్పు రావడాన్ని అత్యంత హానికరంగా అభివర్ణిస్తూ రెండు పార్టీలు ప్రకటనను విడుదల చేశాయి.

మూడు గ్రామీ అవార్డులందుకున్న

గాయకుడి అరెస్టు

లాస్ ఏంజిల్స్: అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఆ కార్యక్రమంలో ర్యాపర్ కిల్లర్ మైక్ మూడు గ్రామీ అవార్డులు గెలుచుకున్నాడు. అయితే వేదికపై అవార్డులు అందుకున్న వెంటనే అతన్ని అక్కడ ఉన్న పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. 48 ఏళ్ల ర్యాపర్ పూర్తి పేరు మైఖేల్ రెండర్. ప్రస్తుతం అతను లాస్ ఏంజిల్స్ పోలీసులు అదుపులో ఉన్నాడు. ప్రవర్తన సరిగా లేని కారణంగా 243(ఏ) పీసీ కింద అతన్ని అరెస్టు చేశారు. ఒకవైపు మ్యూజిక్ అవార్డ్స్ షో కొనసాగుతుండగానే... అతని చేతులకు బేడీలు వేసి పోలీసులు తీసుకు వెళ్లారు. బెస్ట్ ర్యాప్ ఆల్బమ్, బెస్ట్ ర్యాప్ సాంగ్, బెస్ట్ ర్యాప్ పర్ఫార్మెన్స్ కేటగిరీల్లో ర్యాపర్ మైక్ అవార్డులు గెలుచుకున్నాడు. పోలీసులు అతడ్ని ఎందుకు అదుపులోకి తీసుకున్నారో స్పష్టంగా తెలియదు. కానీ అవార్డు అందుకున్న తర్వాత వేదిక వద్ద భద్రతా సిబ్బందితో గొడవ పడినట్లు తెలుస్తోంది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు భావిస్తున్నారు. అవార్డ్స్ షో జరుగుతున్న క్రిప్టో డాట్‌కామ్ ఎరినాలో ర్యాపర్ మైక్ గొడవపడ్డాడని, అందుకే అతన్ని అరెస్టు చేసినట్లు లాస్ ఏంజిల్స్ పోలీసులు వెల్లడించారు. ర్యాపర్ మైక్ తన పాటల ద్వారా సామాజిక న్యాయం, జాత్యహంకారం, నల్లవారికి చెందిన సమస్యలపై ప్రజల్ని చైతన్యపరుస్తున్నాడు.

అమెరికాలో హెచ్-4 వీసాదారులకు శుభవార్త

'వర్క్ ఆథరైజేషన్' బిల్లుకు బైడెన్ ప్రభుత్వ ఆమోదం!

వాషింగ్టన్: అమెరికాలో హెచ్-4 వీసాదారులపై ఆంక్షల్ని తొలగిస్తూ ప్రయోజనం చేకూర్చే బిల్లును సెనెట్ ఆమోదించనుంది. ఈ మేరకు ఆదివారం అమెరికన్ సెనెట్‌లో రిపబ్లికన్లు, డెమొక్రాట్‌ల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల్లో 'జాతీయ భద్రతా ఒప్పందానికి' ఆమోదం తెలిపేందుకు రెండు పక్షాలు అంగీకారం తెలిపాయి. హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు, 21 ఏళ్లలోపు వయసున్న వారి పిల్లలు ఉద్యోగం చేసుకోవడానికి వీలుగా హెచ్-4 వీసాలు జారీ చేస్తుంటారు. హెచ్-4 వీసాదారులు అమెరికాలో ఉద్యోగం చేయాలంటే తప్పనిసరిగా ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఈఏడీ), ఐ-765 కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయి అనుమతి వస్తేనే వారు ఉద్యోగం చేసేందుకు వీలుం టుంది. అయితే ఇది పూర్తవడానికి ఏడాది సమయం పడుతుంది. దీనివల్ల హెచ్-4 వీసాదారులు ఉద్యోగావకా శాలు కోల్పోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతమున్న నిబంధనలు మార్చి హెచ్-4 వీసాదారులకు 'ఆటోమేటిక్‌గా వర్క్ ఆథరైజేషన్' కల్పించేలా రూపొందించిన బిల్లుకు ఆమోదం తెలపనున్నట్లు వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. 'కొత్తగా తీసుకొస్తున్న బిల్లు మన దేశాన్ని బలోపేతం చేయడంతోపాటు సరిహద్దులను సురక్షితం చేస్తుంది. చట్టబద్ధంగా వలసలకు అవకాశం కల్పిస్తుంది' అని అధ్యక్షుడు బైడెన్ ఆ ప్రకటనలో తెలిపారు. ఈ విధానం కింద ఏటా 18 వేల మందికి ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డ్‌లను జారీ చేస్తారు. ఐదేళ్లలో సుమారు 1,58,000 మందికి లబ్ధి కలుగుతుంది. అలాగే, ఏడాదికి 25,000 మంది కే-1, కే-2, కే-3 వలసేతర వీసా (పర్యాటకం, వైద్యం, వ్యాపారం వంటి తాత్కాలిక పనుల నిమిత్తం జారీ చేస్తారు) ఉన్నవారితోపాటు, లక్ష మంది హెచ్-4 వీసాదారులకు తమ జీవిత భాగస్వామి పనిచేసే ప్రాంతంలో ఉద్యోగం చేసే అవకాశం లభిస్తుందని ప్రకటన వివరించింది. ఈ హెచ్-4 వీసాదారులకు ఉద్యోగాలు చేసుకొనే అవకాశాన్ని కల్పిస్తూ 2015లో అప్పటి ఒబామా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో శాస్త్ర సాంకేతిక రంగాల్లో నైపుణ్యం కలిగి ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన వారికి ఆర్థికంగా కొంత ఊరట లభించింది. ఈ హెచ్-4 వీసాలు పొందిన వారిలో ఎక్కువ మంది భారతీయ మహిళలే ఉన్నారు. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై ఆంక్షలు విధించారు. దీంతో వివిధ రంగాల్లో నిపుణులైన భారతీయులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు. కానీ ఇప్పుడు ఈ ఆంక్షలు ఎత్తివేసేందుకు బైడెన్ ప్రభుత్వం సిద్ధమవుతోంది.

ఆరోపణలు నిరూపిస్తే

రాజకీయాల నుంచి తప్పకుంటా: హేమంత్

రాంచి: తనపై వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సవాల్ చేశారు. పటిష్ఠ బందోబస్తు మధ్య హేమంత్ సోరెన్ సోమవారం అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ తన అరెస్టులో రాజ్ భవన్ పాత్ర ఉందని ఆరోపించారు. జనవరి 31వ తేదీ రాత్రి దేశంలోనే తొలిసారిగా ఓ ముఖ్యమంత్రిని అరెస్టు చేశారని, ఇది దేశ చరిత్రలో మాయని అధ్యాయంగా మిగిలిపోతుందని హేమంత్ చెప్పారు. తనపై వచ్చిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేపీకి సవాల్ విసిరారు. జార్ఖండ్‌లో అధికార జేఎంఎం కూటమి శాసనసభాపక్ష నేత చంపై సోరెన్‌కు తమ పూర్తి మద్దతు ఉందని స్పష్టం చేశారు. జార్ఖండ్ ముక్తి మోర్చా అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను విశ్వాస ఓటింగ్‌లో పాల్గొనడానికి రాంచీలోని ప్రత్యేక కోర్టు అనుమతించింది. తాను అసెంబ్లీ సభ్యుడినని, తన పార్టీకి అత్యంత కీలకమైన ఈ సమయంలో తీర్మాన ప్రక్రియలో పాల్గొనే హక్కు తనకు ఉందని సోరెన్ కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన కోర్టు హేమంత్ సోరెన్‌కు విశ్వాస తీర్మానంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. కాగా రూ.600 కోట్ల భూ కుంభకోణంలో హేమంత్ సోరెన్ ప్రమేయం ఉందని ఈడీ ఆరోపించింది. ఈ కేసులో ప్రభుత్వ భూమి యాజమాన్యాన్ని మార్చడానికి, బిల్డర్లకు అమ్మేందుకు భారీగా సంప్రదింపులు జరిగాయని తెలిపింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా, రాంచీ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన 2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఛవీ రంజన్ సహా ఈ కేసులో ఇప్పటి వరకు 14 మందిని ఈడీ అరెస్టు చేసింది.

విజయవాడలోనే కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయం

ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు వినతి

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు కోరారు. ఆళ్ల నేతృత్వంలో ప్రతినిధి బృందం హైదరాబాదు ఎర్రమంజిల్‌లోని జల సౌధలోని కేఆర్ఎంబీ కార్యాలయంలో సంస్థ చైర్మన్ శివనందన్ కుమార్‌ను కలిసి పూర్తి వివరాలతో వినతిపత్రం సమర్పించారు. అనంతరం గోపాల కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విశాఖపట్నం తరలించాలనే వైసీపీ ప్రభుత్వ ప్రతిపాదనపై కేఆర్ఎంబీ విముఖత వ్యక్తం చేసిందని, తాజాగా కేంద్ర జలశక్తి శాఖ వద్ద జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనను శివనందన్ కుమార్ వ్యతిరేకించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో అన్ని రకాల పర్యవేక్షణలు చేయడానికి కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏర్పడిందన్నారు. దీని ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయడానికి కేంద్ర జల శక్తి శాఖ కార్యదర్శి ఆదేశాలకు అనుగుణంగా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2018 జనవరిలో ఆంధ్రప్రదేశ్‌లోని ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఏర్పాటు చేయటానికి భవనాలు పరిశీలించారని, 2020లో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలంసాహ్ని విజయవాడలోనే కేఆర్ఎంబీ కార్యాలయం ఏర్పాటు కోసం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారని, జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల నిర్ణయంలో భాగంగా కేఆర్ఎంబీ కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం సహేతుకం కాదన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ సభ్యులు గుడిపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో తిరుగుబాటు... జగన్‌ను దించేస్తారు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారని, జాబ్ క్యాలెండర్‌పై బటన్ ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. మద్య నిషేధం పైన, గుంతల రోడ్లకు ఎందుకు బటన్ నొక్క లేదని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉండే ఉత్తరాంధ్ర ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి భూములు కొల్లగొట్టారని, విశాఖ నగరంలోనే రూ.40 వేల కోట్లు దోచేశారని, రుషికొండను అనకొండలా మింగేసాడని ఆరోపించారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ కట్టినట్లు విశాఖలో మిలీనియం టవర్స్ నిర్మిద్దామని అనుకున్నట్లు చంద్రబాబు చెప్పారు. అయితే లులు గ్రూపు పోయిందని, మెట్రో పోయిందని, రైల్వే జోన్‌కు 53 ఎకరాలు కేటాయించలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. చివరికి దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా చేసేలా విశాఖను తయారు చేశారన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు జలజీవన్ మిషన్‌లో రూ.100 కోట్లు మింగేశాడని ఆరోపించారు. మరో మంత్రి రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురాలేడు కానీ కోడిగుడ్డు కథలు చెబుతాడని ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పక్కన పెట్టేసారని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే విశాఖ ప్రజలకు పోలవరం నీటిని అందించి రేవాడ నీరు ఈ ప్రాంత రైతులకు పూర్తిగా వినియోగిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలతో పాటు ఐదు సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అంతవరకు నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, అలాగే సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమని హామీ ఇచ్చారు. కె.కోటపాడు గ్రామంలో ఎమ్మెల్సీ చిరంజీవి రావు అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, జనసేన నాయకుడు పంచకర్ల రమేష్ బాబు తదితరులు మాట్లాడారు. సభను విజయవంతం చేసిన స్థానిక ఇన్‌ఛార్జ్ పి.వి.జి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైల ప్రసాద్ రావు, పరిశీలకుడు కర్రోతు నరసింహారావును చంద్రబాబు అభినందించారు.

మా జీవితాలు సర్వనాశనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మెగా డీఎస్సీ హామీ పేరిట వైసీపీ ప్రభుత్వం తమ జీవితాలు సర్వనాశనం చేసిందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 20 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ఇవ్వాలని డీఎస్సీ అభ్యర్థులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్, జనసేన పార్టీల నేతలను అభ్యర్థులు కలిసి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని వినతులు అందజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీకి, మంగళగిరి జనసేన రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు నాగబాబును కలిసి సమస్యలు వివరించారు. వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా యేటా 10వేలతో మెగా డీఎస్సీ ఇస్తానని హామీ ఇచ్చారని, నాలుగున్నరేళ్లు దాటాక కేవలం 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 30 వేలకుపైగా ఖాళీలుంటే అతి తక్కువ పోస్టులనే చూపడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి 117వ జీవో తీసుకొచ్చి, అధిక పోస్టులున్న ఎస్‌జీటీలను రద్దు చేశారని వివరించారు. ప్రభుత్వం జారీచేయబోయే డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్‌జీటీ పోస్టులు కేవలం 1725 మాత్రమే ఉన్నాయన్నారు. ఒక్క కర్నూలు జిల్లాకే 1646 పోస్టులిచ్చి, మిగిలిన జిల్లాలకు జీరో పోస్టులతో తీవ్ర అన్యాయం చేశారని వాపోయారు. దాదాపు ఐదేళ్లపాటు తమ విలువైన సమయం, డబ్బులు వెచ్చించి డీఎస్సీ కోసం సన్నద్ధమవ్వగా, ప్రభుత్వం మాత్రం అరకొర పోస్టులతో తమ జీవితాలు సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. దీనికితోడు అప్రెంటీస్ విధానాన్ని తెరపైకి తెచ్చారని, దీనివల్ల నిరుద్యోగులకు తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. తక్షణమే మెగా డీఎస్సీ విడుదల తేదీని ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై నాగబాబు మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులకు జనసేన అండగా ఉంటుందన్నారు. రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కార్మికులకు ద్రోహం చేస్తే సహించం

ఏపీఎండీసీకి ఈశ్వరయ్య హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ: మంగంపేట బైరైటీస్‌లో ఏపీఎండీసీ యాజమాన్యం అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ అధికార పార్టీకి దోచిపెడుతుందని, ఆ సంస్థలో పని చేస్తున్న కార్మికులకు ద్రోహం చేస్తే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట ఏపీఎండీసీ సంస్థ బైరైటీస్ ఎగుమతుల్లో ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. ఈ సంస్థలోని వివిధ విభాగాల్లో రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, ట్రయినీ, కాంట్రాక్ట్ పద్ధతులలో ఉద్యోగాలు చేస్తున్న కార్మికులు సుమారు 1,500 మంది ఉన్నారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు సంబంధించి టీఎస్ఎండీసీగా, ఆంధ్ర ప్రదేశ్‌కు ఏపీఎండీసీగా ఏర్పాటయిందన్నారు. ఒప్పందం ప్రకారం ఏపీఎండీసీకి 59 శాతం, టీఎస్ఎండీసీకి 41 శాతం వాటాల రూపంలో విభజించడం జరిగిందని తెలిపారు. అప్పటి నుంచి ఏపీఎండీసీకి రావాల్సిన వాటాల నిమిత్తం అనేక సార్లు తెలంగాణ ప్రభుత్వంతో ఏపీఎండీసీ యాజమాన్యం చర్చలు జరపగా 59 శాతంతో కూడిన మొత్తాన్ని ఏపీఎండీసీ సంస్థకు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. సుమారు రూ.990 కోట్లు రావలసి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆదాయమంతా ఏపీఎండీసీ కార్మికుల రెక్కల కష్టార్జితమన్నారు. అయితే ఏపీఎండీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, యాజమాన్యం కలిసి కార్మికులకు చెందవలసిన కోట్లాది రూపాయలను దొడ్డిదారిన వెంకట్ రెడ్డి స్వలాభం కోసం జగన్ ప్రభుత్వానికి అప్పనంగా అప్పజెప్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అలాంటి ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. ఏపీఎండీసీకి వచ్చే మొత్తాన్ని సంస్థలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి, జీతభత్యాల కోసం వినియోగించాలన్నారు. ఏపీఎండీసీ యాజమాన్యం నుంచి అక్రమంగా వచ్చే డబ్బు కోసం వైస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశించి, ఆ డబ్బు ద్వారా ఎన్నికల్లో ఓట్లను కొనుగోలు చెయ్యాలనే దురాలోచన సరైనది కాదని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలను నమ్ముకుంటే అధికారులు జైలు పాలు కాక తప్పదన్నారు. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీఎండీసీ యాజమాన్యం ఇచ్చిన కోట్లాది రూపాయలను కూడా వెనక్కి తెప్పించుకొని కార్మికులకు వినియోగించాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో ఏపీఎండీసీ పురోగాభివృద్ధి కోసం పని చేస్తున్న కార్మికుల పక్షాన నిలబడి ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈశ్వరయ్య హెచ్చరించారు.

8న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 8వ తేదీ గురువారం ఉదయం 10-30 గంటలకు విజయవాడలోని దాసరి నాగభూషణరావు భవన్‌లో జరుగుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆహ్వానితులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ నెల 16వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూ) తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేయటం, ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ సమితి సమావేశాల నిర్ణయాలపై తగు కార్యాచరణపై చర్చిస్తామని పేర్కొన్నారు.

విశ్వాస పరీక్షలో చంపై ప్రభుత్వం విజయం

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వ విశ్వాస పరీక్షకు హాజరయ్యారు. 81 మంది సభ్యులు గల అసెంబ్లీలో విశ్వాస తీర్మానంపై చర్చను ముఖ్యమంత్రి చంపై ప్రారంభిస్తూ దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని, 2019లో హేమంత్ సోరెన్‌కు ప్రజాతీర్పు లభించిందని గుర్తుచేశారు. అలాంటి ముఖ్యమంత్రిని భూకుంభకోణం కేసులో అరెస్టు చేశారని చంపై సోరెన్ ఆవేదన వ్యక్తం చేశారు. జార్ఖండ్ చరిత్రలో గిరిజనులు ఎప్పుడు తమ సామర్థ్యాన్ని పెంచుకోవాలని చూసినా ఆ నాయకత్వాన్ని అణిచివేసే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. హేమంత్ సోరెన్ విషయంలో ఎలాంటి అన్యాయం జరిగిందో ఈరోజు యావద్దేశ ప్రజలు చూశారని, మీరు ఏ గ్రామానికి వెళ్లి చూసినా ప్రతి ఇంట్లోనూ హేమంత్ సోరెన్ ప్రవేశపెట్టిన పథకాలు కనిపిస్తాయని సీఎం చెప్పారు.

ప్రజాస్వామ్యం ఖూనీ సహించం

(మొదటిపేజీ తరువాయి)

ఒక సభ్యుడు ఉన్నారు. మేయర్ ఎన్నికలో బీజేపీ నుంచి మనోజ్ సోంకర్, ప్రతిపక్షాల కూటమి (ఇండియా) అభ్యర్థిగా కుల్‌దీప్ సింగ్ పోటీ చేశారు. నిజానికి ఈ ఎన్నికలో సంఖ్యాపరంగా చూసుకుంటే ఆప్- కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించాల్సి ఉంది. అలా జరగలేదు. పోలింగ్ సమయంలో బీజేపీ అభ్యర్థికి 16 ఓట్లు రాగా... కుల్‌దీప్ సింగ్‌కు 12 ఓట్లు పోల్ అయ్యాయి. కాంగ్రెస్-ఆప్‌కు చెందిన ఎనిమిది ఓట్లను రిటర్నింగ్ అధికారి అనిల్ మసీ... చెల్లనివిగా ప్రకటించారు. దీంతో 16 ఓట్లతో బీజేపీ అభ్యర్థి గెలిచారు. ఈ ఎన్నిక వ్యవహారంపై ఆప్- కాంగ్రెస్ కూటమి తొలుత పంజాబ్-హరియాణా హైకోర్టును ఆశ్రయించగా... బీజేపీ గెలుపుపై స్టే విధించేందుకు నిరాకరించింది. ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన అనిల్ మసీహ్‌ను మూడు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. దీంతో ఆప్-కాంగ్రెస్ కూటమి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మేయర్ ఎన్నికలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపింది. తమకు ఉన్న సంఖ్యాబలం గురించి వివరించింది. ప్రత్యేకించి- తమ కూటమికి చెందిన కౌన్సిలర్లు వేసిన ఎనిమిది ఓట్లను చెల్లనివిగా ప్రకటించడం సరికాదని, దీనిపై విచారణ జరిపించాలని కోరింది. ఈ పిటిషన్‌ను సోమవారం విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు.... ఘాటు వ్యాఖ్యలు చేసింది. రిటర్నింగ్ అధికారి.. బ్యాలెట్ పత్రాలను తారుమారు చేశారని, వాటిని ట్యాంపర్ చేశారనే విషయం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియను రిటర్నింగ్ అధికారి అపహాస్యం చేశారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటర్నింగ్ అధికారి తీరు ఇదేనా? ఎన్నికలను నిర్వహించేది ఇలాగేనా అంటూ రిటర్నింగ్ అధికారిని నిలదీసింది. అతను అన్ని రకాలుగా శిక్షార్హుడని తేల్చి చెప్పింది. బ్యాలెట్ పేపర్లు, వీడియోలతో సహా ఈ ఎన్నిక సంబంధించిన అన్ని రికార్డులనూ భద్రపర్చాలని, వాటన్నింటినీ పంజాబ్ హర్యానా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు అందజేయాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలను వెలువడించేంత వరకూ కొత్త మేయర్ మనోజ్ సోంకర్ సారథ్యంలో ఎలాంటి సమావేశాలు గానీ, భేటీలను గానీ నిర్వహించకూడదని స్పష్టం చేసింది సుప్రీంకోర్టు. ఆయన ఎలాంటి అధికారిక భేటీలను నిర్వహించకూడదని తెలిపింది. 'ప్రిసైడింగ్ అధికారి ప్రవర్తనను చూసి మేం ఆందోళన చెందుతున్నాం. ఆయన కెమెరాను చూసి ఎందుకు భయపడి పారిపోతున్నారు? ఆయన బ్యాలెట్ పేపర్లను మార్చుతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆయన్ను గమనిస్తోందని ఆ అధికారికి చెప్పండి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల బ్యాలెట్ పేపర్లు, వీడియోగ్రఫీని సాయంత్రం 5గంటల లోపు భద్రపరచాలని పంజాబ్, హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. చండీగఢ్ కార్పొరేషన్ తదుపరి సమావేశాన్ని వాయిదా వేసుకోవాలని పేర్కొంది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసింది.

ఆప్ కౌన్సిలర్ల ఓట్లు చెల్లకుండా కుట్ర

ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన బీజేపీ మైనారిటీ సెల్ సభ్యుడు ప్రిసైడింగ్ ఆఫీసర్ అనిల్ మసీహ్... బ్యాలెట్ పత్రాలపై నమోదైన ఓట్లను రికార్డుల్లోకి ఎక్కించేముందు కొందరు ఆప్ కౌన్సిలర్ల బ్యాలెట్ పేపర్లపై ఏదో రాస్తున్నట్లు కనిపించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఆప్-కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి సునాయాసంగా గెలుస్తారని భావించిన మసీహ్.. ఆప్ కౌన్సిలర్ల బ్యాలెట్ పత్రాలపై ఏదో రాయడం ద్వారా ఓట్లను చెల్లుబాటు కాకుండా చేసి, బీజేపీకి విజయాన్ని అందించారని ఆప్ పేర్కొంది. 'బ్యాలెట్ పేపర్లను తారుమారు చేశాడని స్పష్టంగా తెలుస్తోంది... వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నది... కెమెరాల్లోకి చూస్తూ బ్యాలెట్ పేపర్ పాడుచేస్తున్నాడు... ఇదేనా ఆయన ఎన్నికలు నిర్వహించే తీరు? ఇది ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేయడమే...ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే...ఈ వ్యక్తిని ప్రాసిక్యూట్ చేయాలి' అని కోర్టు మండిపడటం గమనార్హం.

నవరత్నాలతో సమగ్రాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు రూ.73,417 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అమ్మఒడి పథకం ప్రవేశపెట్టి విద్యార్థుల ఖాతాల్లో నేరుగా రూ.15 వేలు జమ చేయడంతో పాటు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు జగనన్న గోరుముద్ద అమలు చేస్తున్నాం. జగనన్న విద్యాకానుక, డిజిటల్ లెర్నింగ్, 8,9 తరగతుల విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, విదేశాల్లో చదువుకునే విద్యార్థుల కోసం విదేశీ విద్యాదీవెన పథకం అమలు చేస్తున్నామన్నారు. అలాగే వైద్య రంగంలో అనేక సంస్కరణలు తెచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,132 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పాటు 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 177 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 53 ఏరియా ఆస్పత్రులు, తొమ్మిది జిల్లా ఆస్పత్రుల్లో నాడు-నేడు ద్వారా సౌకర్యాలు మెరుగుపరిచాం. ఇప్పటి వరకు 53,126 మంది వైద్య సిబ్బందిని నియమించాం. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు. ఇక మరో కీలకరంగమైన వ్యవసాయ రంగంలోనూ 10,778 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా అన్నదాతకు విత్తనం దగ్గర నుంచి ఉత్పత్తుల విక్రయం వరకు అండగా నిలుస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 53.53 లక్షల రైతులకు రైతు భరోసా కింద రూ.33,300 కోట్లు పంపిణీ చేశాం. రూ.50.30 కోట్లతో 35 ఆక్వా ల్యాబ్‌లు ఏర్పాటు చేశాం. రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని గవర్నర్ వివరించారు. ఇక ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రతీ కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మహిళా సాధికారత, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వైఎస్సార్ ఆసరా ద్వారా 78.84 లక్షల మంది మహిళలకు రూ.25,571 కోట్లు ఆర్థిక సాయం అందించాం. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 66.34 లక్ష మందికి పెన్షన్ అందిస్తున్నాం. వైఎస్సార్ సున్నావడ్డీ పథకం కోసం రూ.4,969.05 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.14,129 కోట్లు, వైఎస్సార్ కాపునేస్తం కింద రూ.2,029 కోట్లు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద రూ.1,257.04 కోట్లు, ఆటో ట్యాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ మొబైల్ డిస్పెన్సింగ్ ఓనర్లకు 10 వేలు, జగనన్న చేదోడు ద్వారా దుకాణాలు, నాయిబ్రాహ్మణులు, దర్జీలకు రూ.10 వేలు, వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా రూ.350.89 కోట్లు... ఇలా నాలుగేళ్లలో నాన్ డీబీటీ కింద 4.23 లక్షల కోట్ల సంక్షేమ ఫలాలు అందించామని గవర్నర్ పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. పీడీఎఫ్ కుటుంబాలకు సానుభూతితో పునరావాసం కల్పించాం. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకు 74.01 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.280 కోట్లతో 10 టీఎంసీల చిత్రావతి ప్రాజెక్టును, అవుకు ప్రాజెక్టు రెండో టన్నెల్‌ను, కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి చేశాం. పులిచింతల నిర్వాసితులకు రూ.142 కోట్లు చెల్లించామన్నారు. విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు వ్యవసాయ ఫీడర్లు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల త్రీఫేజ్ కరెంట్ ఇస్తున్నామన్నారు. ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన 880 బస్సులు ఏర్పాటు చేశాం. ఐటీని అభివృద్ధి చేస్తున్నాం. ఎయిర్‌పోర్టులు, పోర్టులు అభివృద్ధి చేశాం. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడంపై దృష్టి పెట్టి 7,290 మందికి ఉపాధి కల్పించేలా రూ.3,685 కోట్ల పెట్టుబడులు పెడుతున్నామని వివరించారు. వికేంద్రీకరణకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ మరోసారి పునరుద్ఘాటించారు. 13 కొత్త జిల్లాలు ఏర్పాటు కావడంతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందని, 2.6 లక్షల మంది వలంటీర్ల ద్వారా ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు.

50 శాతం కోటా పరిమితి ఎత్తేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా నిల్చోవడం ద్వారా ప్రభుత్వం రక్షించబడిందన్నారు. వారు దర్యాప్తు సంస్థలు, డబ్బు బలం ద్వారా అన్ని ప్రతిపక్షాలు పాలిత రాష్ట్రాలలో దీన్ని చేస్తారని ఆరోపించారు. 'వారు ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు. ప్రజల గొంతును అణచివేయాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్య స్వరాన్ని అణచివేయడానికి 'ఇండియా' కూటమి అనుమతించదు' అని కాంగ్రెస్ నాయకుడు ర్యాలీలో నొక్కి చెప్పారు. తన 'క్రోనీ క్యాపిటలిస్ట్ స్నేహితులకు' ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు)ను ప్రైవేటీకరించే ప్రయత్నమని మోదీ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 'నరేంద్ర మోదీ, ఆయన ప్రభుత్వం పీఎస్‌యూలను నెమ్మదిగా చంపేస్తున్నాయి. హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఈసీ లిమిటెడ్) పనిచేయకూడదని కేంద్ర ప్రభుత్వం కోరుతోంది. రాబోయే రోజుల్లో హెచ్‌ఈసీ పేరును అదానీ నేమ్‌ప్లేట్‌తో మారుస్తారని అన్నారు. 'వారు దానిని ప్రైవేటీకరించాలనుకుంటున్నారు. నేను ఎక్కడికి వెళ్లినా పీఎస్‌యూల కార్మికులు, ఉద్యోగులు తమ చేతుల్లో పోస్టర్లతో నిలబడటం నేను చూస్తున్నాను. అది బీహెచ్‌ఇఎల్, హెచ్‌ఏఎల్ లేదా హెచ్‌ఈసీ కావచ్చు. నెమ్మదిగా అదానీకి అప్పగిస్తున్నారు' అని గాంధీ ఆరోపించారు. అలాంటి ప్రైవేటీకరణను కాంగ్రెస్ అనుమతించదని ఆయన తేల్చిచెప్పారు. 'మీరు ఏమి చేయాలనుకుంటే అది చేయండి. అదానీ పేరును హెచ్‌ఈసీలో ఉంచనివ్వము. అదానీకి ఈ ఉచిత బహుమతిని ఇవ్వడానికి మేము అనుమతించమని బీజేపీ వారికి చెబుతున్నాను' అని అన్నారు. అదానీకి లబ్ధి చేకూర్చేందుకు కేంద్రం అన్ని పీఎస్‌యూలను తొక్కిపెడుతోందని, ఈ ప్రైవేటీకరణ దళితులు, ఓబీసీలు, గిరిజనులు, మైనారిటీలు, పేద సాధారణ కులాల నుంచి 'దోచుకునే' ప్రయత్నమని ఆయన విమర్శించారు. మరికొద్ది నెలల్లో దళితులు, ఓబీసీలు, గిరిజనులు, మైనారిటీలు, సాధారణ కులాల పేదలు తమ సంఖ్యను తెలుసుకుంటారని గాంధీ చెప్పారు. ప్రభుత్వాన్ని నడుపుతున్న 90 మంది కార్యదర్శులలో ముగ్గురు మాత్రమే ఓబీసీ కేటగిరీకి చెందిన వారని అన్నారు. దేశంలో 'భారీ' నిరుద్యోగం ఉందని, నోట్ల రద్దు కారణంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 'నాశనమయ్యాయని' గాంధీ తెలిపారు. 'నల్లధనానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాను' అని ప్రధాని మోదీ అబద్ధం చెప్పారని, ఆపై నోట్ల రద్దు, జీఎస్టీని అమలు చేశారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ యువత ఉద్యోగాలు పొందలేరని కాంగ్రెస్ నేత అన్నారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ వివిధ మతాలు, భాషలకు చెందిన ప్రజలు గొడవపడేలా చేశారని ఆరోపించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ ద్వేషం, హింసకు వ్యతిరేకంగా తాను కన్యాకుమారి నుంచి కాశ్మీర్ భారత్ జోడో యాత్ర చేశానని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చెప్పారు. ఆ యాత్రలో లక్షలాది మంది కలిసి నడిచి కొత్త బాటను చూపారన్నారు.

బీజేపీతో జతకడితే... రాజకీయ సమాధే

ఈశ్వరయ్య హెచ్చరిక

విశాలాంధ్ర-విజయనగరం: బీజేపీతో జతకట్టిన ఏపార్టీకైనా రాజకీయ సమాధి తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. దేశాన్ని అథోగతిపాల్జేసిన బీజేపీతో కలిసివెళ్లే ఏ పార్టీనైనా ఓడించాలని పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోదీ... దేశాన్ని అమ్మకానికి పెట్టారనీ, కార్మిక, రైతాంగ వ్యతిరేక చట్టాలు తీసుకు వచ్చారన్నారు. రాష్ట్రానికిచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. బీజేపీ నేత అద్వానీకి భారతరత్న ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక, విద్య, క్రీడా తదితర రంగాలలో విశేష కృషి చేసినవారికి పురస్కారాలు అందించే సంప్రదాయం ఉందనీ, మోదీ మాత్రం రథయాత్ర చేపట్టి మతాల మధ్య చిచ్చుపెట్టిన అద్వానీకి భారతరత్న ప్రకటించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందనీ, ఇదే అభిప్రాయం ప్రజల్లో కూడా ఉందన్నారు. గతంలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన నానాజీ దేశ్‌ముఖ్‌కు పురస్కారం ప్రకటిస్తే వ్యతిరేకించామనీ, అదే ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి వచ్చిన అతల్ బిహారీ వాజ్‌పేయ్‌కు పురస్కారం ప్రకటించినప్పుడు అభ్యంతరం తెలపలేదని గుర్తు చేశారు. అద్వానీకి పురస్కారం ప్రకటించడం వెనుక రాజకీయ, మత ప్రయోజనాలున్నాయన్నారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ తరువాత మోదీ, అమిత్‌షా జపం మొదలైందన్నారు. శ్రీరామచంద్రుని చిత్రపటాల్లో మోదీ బొమ్మలుపెట్టే స్థాయికి దిగజారి మోదీని అభినవ శ్రీరాముడిలా చిత్రించే స్థితికి వచ్చారని ఆరోపించారు. రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసీని అమ్మకానికి పెట్టిన మోదీతో జతకట్టకూడదని చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. పవన్ బీజేపీని వీడి...వామపక్షాలు, టీడీపీతో కలిసి ఇండియా కూటమితో కలిసి రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో తలమునకలయ్యారనీ, అభ్యర్థుల స్థానాలను అటూఇటూ మారుస్తున్నారనీ, మార్చాల్సింది ఆట గాళ్లను కాదనీ, కెప్టెన్‌నని ప్రజలు భావిస్తున్నారని ఈశ్వరయ్య అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజలను మరోసారి మాయ చేయడానికి సిద్ధం అంటున్నారనీ, దేనికి సిద్ధమో చెప్పాలన్నారు. రాష్ట్రంలో విధ్వంసాన్ని కొనసాగించి నందుకా,చేసిన శంకుస్థాపనలే చేసి వాటికి నిధులు కేటాయిం చనందుకా, విభజన హక్కులు సాధించనందుకా సిద్ధమని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదనీ, విశాఖ రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని షర్మిల మాట్లాడితే, ఆమెకు మాట్లాడే హక్కు లేదంటున్నారన్నారు.. జగన్‌కు తప్ప ఎవరికీ మాట్లాడే హక్కులేదా అని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు అలమండ ఆనందరావు, బుగత అశోక్ పాల్గొన్నారు.

కవులు, కళాకారులు ఎవరి పక్షం?

గరికపాటికి గని ఘన నివాళి

విశాలాంధ్ర-గుంటూరు: కందుకూరి, గురజాడ, గరికపాటి వంటి నిజమైన హీరోలు మరుగునపడుతున్న తరుణంలో కవులు, కళాకారులు పాలకవర్గాల పక్షమా లేక ప్రజల పక్షమా తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఇప్టా జాతీయ కార్యదర్శి గని చెప్పారు. డాక్టర్ గరికపాటి రాజారావు 110వ జయంతి కార్యక్రమాన్ని గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం ఘనంగా జరిపారు. గరికపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో గని మాట్లాడుతూ ఆకాశమార్గంలో పయనిస్తున్న కళలను భూమార్గం పట్టించి కళ కళ కోసం కాదు... కళ ప్రజల కోసం అనే నినాదాన్ని ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారంలో పెట్టిన మహానేత డాక్టర్ గరికపాటి రాజారావు అని కొని యాడారు. నేడు ఆయన ఆశయాలకు తూట్లు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు నూతలపాటి వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు మెట్టపల్లి మహేంద్ర, ప్రధాన కార్యదర్శి చెవుల పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవి జీవితం ఆదర్శనీయం

వర్ధంతి సభలో దుర్గాభవానీ, కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-మచిలీపట్నం: కమ్యూనిస్టు పార్టీ నేత లలితాదేవి జీవితాన్ని, ఆమె అంకిత భావాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె బాటలో మన మంతా పయనించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గా భవాని అన్నారు. స్థానిక భాస్కరపురంలోని మోదుమూడి రామారావు నివాసంలో మోదుమూడి లలితాదేవి 26వ వర్ధంతి జొన్నవిత్తుల ఝాన్సీ రాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. దుర్గా భవాని మాట్లాడుతూ కమ్యూనిస్టు భావజాలంలో అత్యంత విలువలతో ఆమె జీవించారని కొనియాడారు. మహిళా, ప్రజాసంఘాల నిర్మాణానికి ఆమె ఎనలేని కృషి చేశారన్నారు. ఇంటికి వచ్చిన కార్యకర్తలను సొంత బిడ్డల్లా చూసుకున్నారన్నారు. నేటితరం కమ్యూనిస్టులకు ఆమె ఆదర్శమని నివాళి అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ మోదుమూడి శ్రీహరి రావుకి భార్యగా కుటుంబాన్ని చక్కదిద్దడంతోపాటు కమ్యూనిస్టుల ఆశయాల కోసం బిడ్డలను సైతం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేశారని శ్లాఘించారు. పార్టీ సిద్ధాంతాల కోసం తుది శ్వాస వరకు కృషి చేశారని నివాళి అర్పించారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు మాట్లాడుతూ ఇంటికి వచ్చిన ప్రతి కార్యకర్త ఆకలి తీర్చారని పేర్కొంటూ లలితాదేవికి అంజలి ఘటించారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం శ్రీహరిరావు అడుగు జాడల్లోనే ఆమె నడిచి, కుటుంబాన్ని కూడా నడిపించిన తీరు నేటి తరానికి ఆదర్శమన్నారు. తొలుత లలితాదేవి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సీపీఐ కృష్ణా జిల్లా నాయకులు నార్ల వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి తాటిపర్తి తాతయ్య, జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు మల్లుపెద్ది రత్నకుమారి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కట్టా హేమసుందర్ రావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, మహిళా సమాఖ్య నాయకురాలు ఓడుగు రత్నకుమారి, పి.రాణి, లలితాదేవి అల్లుడు దాలిపర్తి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేతనాల పెంపు డిమాండ్‌తో

8న గోరుముద్ద కార్మికుల రాష్ట్రవ్యాప్త ధర్నాలు

ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న గోరుముద్ద పథకంలో పని చేస్తున్న 85 వేల మంది పేద మహిళా కార్మికుల వేతనాలను, విద్యార్థుల మెస్ చార్జీలను తక్షణమే పెంచాలని ఫిబ్రవరి 8న డీఈఓ కార్యాలయాల దగ్గర ధర్నాలు చేపడుతున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రవంతి, రమేష్ బాబు పిలుపునిచ్చారు. సోమవారం గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం ప్రవంతి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మికుల సమస్యలు ఏమాత్రం పట్టించుకోకుండా పరిపాలన కొనసాగించిందన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు, విద్యార్థుల మెస్ చార్జీలు పెంచకుండా వారిపై భారాలు మోపుతూ వారి శ్రమను దోచుకుంటున్నారని, వారి శ్రమతో రాజకీయ ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. నాలుగున్నర సంవత్సరాలుగా కార్మికులు వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తున్నా కనీసం చీమకుట్టినట్లు లేదన్నారు. తన పేరుపై పెట్టుకున్న జగనన్న గోరుముద్ద పథకం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారిందని విమర్శించారు. నిధులను తప్పుడు మార్గంలో ఉపయోగిస్తోందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వెయ్యి రూపాయలు కూడా వేతనాలు పెంచే ఆలోచన లేదా? అని సీఎంను ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. తక్షణమే వేతనాలు, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ అరుణ్, ఈశ్వరమ్మ, లాజర్, అలివేలమ్మ, మరియమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సీట్లు, నోట్ల కోసం పవన్ తంటాలు

అంబటి విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీట్లు, నోట్ల ముష్టి కోసం చంద్రబాబు ఇంటికి పవన్ కల్యాణ్ వెళ్లారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడారు. మా టార్గెట్ 175 సీట్లు అని పునరుద్ఘాటించారు. దేశంలోనే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. 2014-19 వరకు రాష్ట్రాన్ని పరిపాలించిన చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన ఏవాగ్ధానాన్ని అమలు చేయలేని, సీఎం జగన్ అమలు చేసి చూపారన్నారు. ఇది బాబు-జగన్ మధ్య ఉన్న తేడా అని వివరించారు. తమ మేనిఫెస్టోను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ఇస్తున్నామని, చంద్రబాబు 2014లో ఇచ్చిన మేనిఫెస్టో ఏకంగా అదృశ్యమైపోయిందని, వెబ్‌సైట్‌లో లేదన్నారు. చంద్రబాబు ఇంటికి పవన్ కల్యాణ్ ఉదయం, సాయంత్రం వెళ్లి వచ్చాడంట, ప్యాకేజీ కోసమా.. సీట్ల కోసం వెళ్లాడా? అని ప్రశ్నించారు. చంద్రబాబు మాట విని కార్యకర్తల్ని ముంచుతాడన్నారు. చంద్రబాబు 20-25 సీట్లు ఇవ్వడమే గగనమని, జనసేన కార్యకర్తలు ఆలోచించుకోవాలని సూచించారు. టీడీపీ-జనసేన నాయకులు ఇంతవరకు సిద్ధమే కాలేదని, ఛేటీలలోనే ఉన్నారని ఎద్దేవా చేశారు. చిత్రంగా లోకేశ్ ఇటీవల కాలంలో కనిపించటడం లేదని, దాచేసినట్టున్నారని అన్నారు. అన్యాయాలు, అక్రమాలు చేసినందునే బాలశౌరికి టికెట్ తిరస్కరించారనన్నారు.

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవం నేడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 26వ వార్షిక స్నాత కోత్సవం ఈనెల 6వ తేదీ మంగళవారం నిర్వహించనున్నామని యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి తెలిపారు. విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఈసీ హాలులో సోమవారం నిర్వ హించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే స్నాతకోత్సవానికి విశిష్ట అతిథిగా గవర్నర్, ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరవుతారన్నారు. బెంగళూరులోని నిమ్హాన్స్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ అండ్ న్యూరో సైన్సెస్) సైకియాట్రీ సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ ప్రతిమామూర్తి మాట్లాడతారని చెప్పారు. వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబర్చిన 60 మంది విద్యార్థులకు పతకాలు, బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణల ఫలితంగా 2022-24 సంవత్సరంలో కొత్తగా 600 పీజీ సీట్లు మంజూరు కావడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటికే ఐదు కాలేజీలు ప్రారంభించామన్నారు. యూనివర్సిటీ పాఠ్యాంశంలో కొత్తగా ఫార్మసీ, సైకాలజీ, ఫిజియోథెరపీ కోర్సులు చేర్చామని చెప్పారు. ఎయిమ్స్, కేఎల్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ తిరుపతి, లండన్ కింగ్స్ కాలేజీల సహకారంతో పరిశోధనలు మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి మాట్లాడుతూ 2020లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పతకాలు, 2021లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీ తీసుకోనున్నారని చెప్పారు. అకడమిక్ జాయింట్ రిజిస్ట్రార్ అజయ్, పరిశోధన, అభివృద్ధి శాఖ డైరెక్టర్ సుమిత శంకర్, జాయింట్ రిజిస్ట్రార్ (ఎగ్జామినేషన్స్) పి.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టిన కాకాణి కేసు

ఎస్పీ మాటే... సీబీఐ చెబుతోంది
మాజీమంత్రి సోమిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : కాకాణి గోవర్ధన్ రెడ్డి కేసు తప్పుదారి పట్టిందని, అప్పటి ఎస్పీ విజయరావు ఏమి చెప్పారో... ఈ రోజు సీబీఐ అదే చెప్పిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. నెల్లూరులో తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'పాత ఇనుము కోసం ఇద్దరు దొంగలు కోర్టు ఆవరణలోకి వెళితే కుక్క అరిచింది. 17 కోర్టులున్న సముదాయంలో కాకాణి కేసుకు సంబంధించిన ఫైళ్లు ఉన్న కోర్టులోకే దొంగలు వెళ్లేలా కుక్క మరోసారి మొరిగింది. దొంగలను ఆ కోర్టు మిద్దె ఎక్కేలా చేసింది కూడా కుక్కే. ఆ కోర్టు భవనంలో 11 అల్మారాలు ఉండగా కాకాణి కేసు ఫైళ్లు ఉన్న అల్మారాను పగలగొట్టేవరకూ కుక్క మొరుగుతూనే ఉంది. కాకాణి గోవర్ధన్ రెడ్డి కేసుకు సంబంధించిన ఆధారాలైన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ తీసుకునే వరకు కుక్క అరుస్తూనే ఉంది. ఈ ఘటన అంతటికీ కుక్క అరవడమే కారణమని అప్పటి ఎస్పీ విజయరావు సెలవిచ్చారు. కోర్టు ఆవరణలో 15 వేల కేసులకు సంబంధించిన ఫైళ్లు ఉంటే వారికి ఒక్క కాకాణి కేసుకు సంబంధించి ఆధారాలున్న ఫైలు మాత్రమే దొరికిందా. చిల్లర దొంగలు ల్యాప్ టాప్, మొబైల్‌లోని డేటాను కూడా కుక్క డైరెక్షన్‌లోని తొలగించారా' అని సోమిరెడ్డి అన్నారు. ఈ కేసులో ఇప్పటికి సీబీఐ ఛార్జ్‌షీట్ మాత్రమే ఫైలు చేసిందన్నారు. కోర్టు అనుమతించి కేసును మూసివేయవచ్చని లేదా మళ్లీ రివ్యూ చేసి పునర్విచారణకు ఆదేశించే అవకాశమూ ఉందని ఆయన తెలిపారు. అయితే అప్పుడే కాకాణి గోవర్ధన్ రెడ్డి భుజాలెగరేసుకుంటూ టపాసులు కాల్చుకుని సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జైలు శిక్ష నుంచి కాకాణి తప్పించుకోలేడన్నారు. నకిలీ డాక్యుమెంట్ల కేసులో పక్కా ఆధారాలున్నాయన్నారు. నీచ చరిత్ర కలిగిన కాకాణి తమ నాయకుడు చంద్రబాబు నాయుడిని నోటికొచ్చినట్టు మాట్లాడటంపై మండిపడ్డారు.

15 మంది పీసీసీ అధికార ప్రతినిధుల నియామకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధులుగా 15 మందిని నియమించినట్లు పీసీసీ మీడియా విభాగం చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి మంగళవారం వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, కర్నూలు, చిత్తూరు, బాపట్ల, విశాఖపట్నం జిల్లాల నేతలకు జాబితాలో చోటుదక్కింది. చింతాడ దిలీప్, మువ్వల శ్రీనివాసరావు, జి.వెంకటరావు, పార్వతి శివగణేశ్, ఎస్.గణపతి, ఆర్.సతీశ్, డి.రామకృష్ణ, శ్రీపతి సతీశ్, సురేశ్‌బాబు, పి.రాంభూపాల్‌రెడ్డి, ఎన్‌డీ విజయ జ్యోతి, వి.శ్రీని వాసులు, ఎం.గుర్నాథంరెడ్డి, తాడికొండ వెంకటేశ్వరరావు, ఏబీఎన్ వర్మ అధికార ప్రతినిధులుగా కొనసాగుతారు.

సమగ్ర కౌలు విధానం అవశ్యం

బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలి: ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కౌలు రైతుల సమస్యలను బడ్జెట్ సమావేశాల్లో చర్చించి పరిష్కారం కోసం సమగ్రమైన కౌలు విధానం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం తీర్మానించింది. ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టాన్ని సవరించి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలుగుర్తింపు కార్డులు జారీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరింది. విజయ వాడ దాసరిభవన్‌లో సంఘం అధ్యక్షులు ఎ.కాట మయ్య అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర సమితి సమావేశం సోమవారం జరిగింది. కౌలు రైతుల ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను చర్చిం చింది. ఆ తీర్మానాలను సంఘ అధ్యక్షులు కాటమయ్య, ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఓ ప్రకటనలో వివరించారు. ఈ ఏడాది కరువు, తుఫాన్‌ల వల్ల లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని నష్టపోయిన కౌలురైతులకే ఇన్‌పుట్స్ సబ్సిడీ, బీమా పరిహారం వెంటనే చెల్లించాలని కోరుతూ తీర్మానించినట్లు వివరించారు. ఏ సీజన్‌లో నష్టం పోయిన పంటలకు ఆ సీజన్‌లోనే పరిహారం ఇస్తామని చెప్పి మూడు నెలలు అయినప్పటికీ ఇంతవరకు ఇవ్వక పోవడం భాదాకరమని,పెట్టుబడి రాయితీ, బీమా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, జిల్లాలో ఏనుగులు, అడివి, పందులు, దుప్పులు, కోతుల వల్ల పంటలు ధ్వంసమవు తున్నాయని, వేలాది ఎకరాల్లో పంటలను నాశనం చేస్తుంటే నివారించేందుకు చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని, అడివి జంతువుల నుంచి పంటలు కాపాడటానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, యంత్ర పరికరాలు, డీజిల్ తదితర ఖర్చులు పెరిగాయి కానీ, పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదనీ, పరపతి సౌకర్యం కౌలు రైతులకు అందడం లేదని, పెట్టుబడి కోసం వడ్డీ వ్యారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. నూటికి రూ. రెండు నుంచి రూ.ఐదు చొప్పున వడ్డీలకు తెచ్చి సాగు చేస్తున్నారని, కౌలు రేట్లు విపరీతంగా పెంచడం, వీటిపై నియంత్రణ లేకపోవడంవల్ల సాగు భారంగా మారిందన్నారు. అతి కొద్ది మందికి అరకొరగా ఇచ్చే రైతుభరోసా ఏ మాత్రం చాలటం లేదని విమర్శిం చారు. ప్రతి ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం ప్రతి కౌలు రైతుకు అందించాలన్నారు. దేశంలోనే ఆత్మహత్యల్లో మన రాష్ట్రం మూడో స్థానంలో ఉందని, కౌలు రైతులు రెండో స్థానంలో ఉన్నారని వివరించారు. ప్రతి కౌలురైతు కుటుంబం సగటున రెండున్నర లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ తరహాలో రుణ ఉపశమనం చట్టం తీసుకు రావాలని, తద్వారా రుణ విముక్తి చేసి కౌలు రైతులను రక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల బకాయిలు విడుదల చేయండి

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమానికి సిద్ధం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిల చెల్లింపులో జరుగుతున్న జాప్యం వల్ల ఎంతోమంది ఉద్యోగులు తమ బాధ్యతలను సకాలంలో నెరవేర్చుకోలేకపోతున్నారని ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సుమారు 30 వేల కోట్ల రూపాయల బకాయిలు మూడేళ్లుగా ప్రభుత్వం చెల్లించడం లేదని తెలిపారు. డీఏ, ఎరియర్స్ మొత్తంలో కొంత మొత్తాన్ని ఈ ఏడాది జనవరిలోగా ఇస్తామన్న హామీని కూడా పట్టించుకోవడం లేదన్నారు. జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌లో కూడా ప్రభుత్వ ఉదాసీనత ఉద్యోగులను మనోవేదనకు గురిచేస్తోందని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఈ అంశంలో ఉద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకం కూడా ప్రభుత్వం నుంచి అందడం లేదని తెలిపారు. 11వ పీఆర్‌సీని ఇప్పటికే ప్రకటించాల్సి ఉందని, కానీ పీఆర్‌సీ కమిషనర్‌కు ఇప్పటి వరకు కార్యాలయాన్ని కూడా చూపలేదన్నారు. ఈనెల 11న జేఏసీ విస్తృతస్థాయి సమావేశంలో జేఏసీలోని అన్ని సంఘాలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అవసరమైతే సమ్మె నోటీసు ఇచ్చేందుకు కూడా వెనుకాడబోమన్నారు. ఏపీ జేఏసీ ప్రధాన కార్యదర్శి జి.హృదయరాజు మాటా డుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల న్యాయమైన రాయితీల విషయంలో అలసత్వం వహిస్తోందన్నారు. ప్రతినెల ఉద్యోగులకు చెల్లించే జీతాల విషయంలో ఒకరోజు అటు ఇటు అయినప్పటికీ పెన్షనర్లకు మాత్రం నిర్ణీత సమయంలో పెన్షన్లు ఇవ్వాలన్నారు. పోలీసులకు సరండర్స్ డబ్బుల చెల్లింపులో జాప్యం వల్ల ఎంతోమంది పోలీసులు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉప ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ ఐఆర్ ప్రకటన దాఖలాలు ఇప్పటికీ లేవన్నారు. తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్య దర్శికి వినతి పత్రం ఇప్పటికే ఇచ్చామన్నారు. ఉద్యోగులు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యలు చేసుకుం టున్న పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఏపీ జేఏసీ కోచైర్మన్ హెచ్.తిమ్మన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఆర్.ఎస్.హరినాథ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, కృష్ణాజిల్లా అధ్యక్షులు ఉల్లి కృష్ణ, జేఏసీలోని వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలపై

అసెంబ్లీలో సీఎం ప్రకటన చేయాలి

సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారంపై సీఎం జగన్ అసెంబ్లీలో ప్రకటన చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ప్రారంభమయ్యాయి. సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ.బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరయ్యారు. నూటికి 97 శాతం హామీలు అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం... ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని ఓ తీర్మానంలో విమర్శించింది. ఇప్పటికైనా ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు అసెంబ్లీ సమావేశాలలో ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని మూడు లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని గుర్తుచేసింది. విద్యుత్ రంగంలోని కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada-520002 (A.P.)
E PROCUREMENT TENDER NOTICE
NIT No. 02/MAU61-ADMNOSD(VI)/07/2023-HB/1/2024-HB, Dated: 02/02/2024
Name of Work: "Operation and Maintenance of Street Lighting in VIP routes of Amaravati Capital Region Villages and newly Provided Street Lights in Seed Access Road"- Estimate Cost Rs. 41.50 Lakhs. The bid may be downloaded on AP e-procurement portal from 06-02-2024 to 20-02-2024 up to 14.00 Hrs. Due date for submission of Bid 20-02-2024 up to 15.00 Hrs, Technical bid opening 20-02-2024 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Chief Engineer (T&T), APCRDA, Vijayawada.

సంపాదకీయం

జార్ఖండ్‌లో పారని బీజేపీ పాచిక

ఇరవై మూడేళ్ల కింద ఏర్పడిన జార్ఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం విశ్వాస పరీక్షలో నెగ్గడం విచిత్రం కాదు కానీ జార్ఖండ్ ప్రభుత్వాన్ని అస్థిరం చేయడానికి బీజేపీ పన్నిన కుట్ర మాత్రం ఘోరంగా విఫలమైంది. సోమవారం నాటి విశ్వాస పరీక్షలో జార్ఖండ్ శాసన సభలో మొత్తం 81 మంది ఉంటే 47 మంది జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, ఆర్.జె.డి. సీపీఐ (ఎం.ఎల్.) సంకీర్ణ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారు. 29 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అవినీతి ఆరోపణ కింద ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టొరేట్ చాలా కాలంగా ఇటీవలి దాకా ముఖ్యమంత్రిగా ఉన్న హేమంత్ సొరేన్ ను ముప్పు తిప్పలు పెట్టింది. నోటీసుల మీద నోటీసులు జారీ చేసింది. చివరకు సొరేన్ రాజీనామా చేయక తప్పని పరిస్థితి తీసుకొచ్చింది. సొరేన్ మంత్రివర్గ సభ్యుడు చంపై సొరేన్ తదుపరి ముఖ్యమంత్రి అవుతారనుకున్నారు. ఆ దశలో జార్ఖండ్ గవర్నర్ సి.పి. రాధాకృష్ణను సైంధవుడిలా అడ్డం పెట్టారు. రెండు రోజుల పాటు ఉలక లేదు పలక లేదు. అంటే దాదాపు 48 గంటల పాటు జార్ఖండ్‌లో ప్రభుత్వమే లేకుండా పోయింది. తప్పుకోక తప్పదని హేమంత్ సొరేన్ నిర్ణయించుకున్న తరవాత చంపై సొరేన్ ముఖ్యమంత్రి స్థానంలోకి వస్తారనుకున్నారు. రెండు రోజులు ఆలస్యంగానైనా ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేశారు. తన బలం నిరూపించుకోవడానికి పది రోజుల గడువు ఉన్నా ఆయన సోమవారమే విశ్వాస పరీక్షకు సిద్ధ పడ్డారు. విశ్వాస పరీక్ష జరిగినప్పుడు 77 మంది సభలో ఉన్నారు. 47 మంది చంపై సొరేన్ ప్రభుత్వాన్ని సమర్థించారు. అయితే విశ్వాస పరీక్ష లాంటివి జరిగినప్పుడు చాలా రాష్ట్రాలలో ఒక విచిత్రమైన ఆనవాయితీ కొనసాగుతోంది. తమకు మద్దతు ఇచ్చే సభ్యులను ఎదుటి పక్షం కోనేయకుండా వారిని మరో రాష్ట్రంలోకి తీసుకెళ్లి జాగ్రత్త పడ్తున్నారు. చంపై సొరేన్ కూడా తన మద్దతుదార్లను హైదరాబాద్‌కు చేర్చారు. వారు ఆదివారం రాత్రే రాంచీ చేరుకున్నారు. డబ్బిచ్చి ఎమ్మెల్యేలను కొనడం బీజేపీ సునాయాసంగా చేయగలిగినపని. అందుకే వారిని హైదరాబాద్‌కు తీసుకురావలసి వచ్చింది. హేమంత్ సొరేన్ రాజీనామా చేయడానికి ముందు పెద్ద నాటకమే జరిగింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అధికార్ల బృందం ఢిల్లీలోని హేమంత్ సొరేన్ ఇంటి మీద దాడి చేసింది. కానీ అక్కడ సొరేన్ కనిపించలేదు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రి కనిపించకుండా పోయారని బీజేపీ ప్రచారం చేసింది. కానీ అందరి కళ్లు కప్పి హేమంత్ సొరేన్ జార్ఖండ్ చేరుకుని కొత్త ప్రభుత్వం ఏర్పడడానికి కావలసిన పనులన్నీ చక్కబెట్టారు. జార్ఖండ్ ముక్తి మోర్చా ప్రభుత్వాన్ని కాపాడడానికి హేమంత్ సొరేన్ ఒక రకంగా పెద్ద సాహసమే చేశారు. జార్ఖండ్ నుంచి ఢిల్లీ వెళ్లడానికి వినియోగించిన విమానాన్ని అక్కడే వదిలేసి రోడ్డు మార్గాన 1300 కిలో మీటర్లు ప్రయాణించి రాంచీ చేరుకున్నారు. నిఘా విభాగాల, మీడియా కళ్లుగప్పి ఆయన తన లక్ష్యం సాధించారు.

గత బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ అధికారులు హేమంత్ సొరేన్ ను ఏడుగంటలపాటు ప్రశ్నలతో ముంచెత్తారు. తనను అరెస్టు చేస్తారని గ్రహించిన సొరేన్ చాలా ధైర్యంగా వ్యవహరించారు. అరెస్టు మెమో మీద సంతకం చేయడానికి నిరాకరించారు. ఆ తరవాత రాజీనామాచేసి ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి ఏర్పాట్లు చేసేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రికార్డు ప్రకారం సొరేన్ అరెస్టు అయిఉంటే జార్ఖండ్ లో రాష్ట్రపతి పాలన విధించేది. దీనికి అడ్డుకట్టవేసి సొరేన్ ప్రభుత్వాన్ని కాపాడుకోగలిగారు. ఈ లోగా చంపై సొరేన్ శాసన సభా పక్ష నాయకుడిగా ఎన్నికైపోయారు. అరెస్టు మెమో మీద సంతకం చేయనందువల్ల హేమంత్ సొరేన్‌ను గవర్నర్ నివాసానికి తీసుకెళ్లారు. ఆయన ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాల శాసనసభ్యులతోపాటు చాలా మంది శాసనసభ్యులు అప్పటికే అక్కడికి చేరుకోవడంతో గవర్నర్ చేయగలిగింది ఏమీ లేకుండా పోయింది. వెంటనే చంపై సొరేన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ హేమంత్ సొరేన్ శాసనసభలో బల పరీక్షకు అనుమతించింది. ఇది జార్ఖండ్ ముక్తి మోర్చా శాసనసభ్యుల్లో మరింత ఉత్సహం నింపింది. విశ్వాస పరీక్షకు ముందు హేమంత్ సొరేన్ దమ్ముంటే తనమీద ఉన్న అవినీతి ఆరోపణలు రుజువు చేయాలని సవాలు విసిరారు. ఆరోపణలు కనక రుజువైతే రాజకీయాలనుంచి తప్పుకోను కానీ జార్ఖండ్‌లో ఉండను అని కూడా చెప్పారు. రాజ్ భవన్ ప్రోద్బలం మేరకు ముఖ్యమంత్రిని అరెస్టు చేసిన జనవరి 31వ తేదీ జార్ఖండ్ చరిత్రలో చీకటి రోజు అని హేమంత్ సొరేన్ అన్నారు. జార్ఖండ్‌లో ఏ ప్రభుత్వాన్ని అయిదేళ్ల పాటు బీజేపీ కొనసాగనివ్వదని కూడా ఆయన తెలియజేశారు. అది నిజమే. జార్ఖండ్ 2000 సంవత్సరంలో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే 23 ఏళ్ల కాలంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంపై సొరేన్ తో కలిపి 12 మంది ముఖ్యమంత్రులయ్యారు. నిర్బంధంలో ఉన్నప్పటికీ తాను కన్నీళ్లు కార్చననీ సమయం వచ్చినప్పుడు ఫ్యూడల్ శక్తులకు గట్టి సమాధానం చెప్తానని హేమంత్ ప్రతిజ్ఞ చేశారు. బీజేపీ ఆదివాసులను అంటరానివారిగా పరిగణిస్తోందని కూడా ఆయన ఆరోపించారు. విశ్వాస పరీక్షలు, బలాబలాలు, బీజేపీ కుట్రలు ఎలా ఉన్నా సోమవారం చంపై సొరేన్ ప్రభుత్వం బల పరీక్ష?లో నెగ్గడం ఒక రకంగా బలహీన పడ్డట్టు కనిపిస్తున్న "ఇండియా" ఐక్య సంఘటనకు కొత్త ఊపిరులూదడానికి ఉపకరిస్తుంది. ఈ మధ్య కాలంలో "ఇండియా" ఐక్య సంఘటనలో భిన్న రాగాలు వినిపిస్తున్నాయి. ఈ ఐక్య సంఘటనకు సూత్రధారి అయిన నితీశ్ కుమార్ అలవాటు ప్రకారం మళ్లీ విద్రోహానికి తలపడి బీజేపీలో చేరిపోయారు. మరోవేపు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లోకసభ ఎన్నికల్లో అన్ని స్థానాలకు తమ తృణమూల్ పార్టీ అభ్యర్థులే పోటీ చేస్తారని సర్దుబాటుకు దారులు మూసేశారు. వామపక్ష పార్టీలతో ఆమెకు సయోధ్య ఎటూ కుదరదు కానీ కనీసం కాంగ్రెస్‌తోనైనా సీట్ల సర్దుబాటు కుదిరితే కేంద్రంలో బీజేపీని గద్దె దింపడం సాధ్యం కావచ్చు అనుకుంటున్న దశలో మమత బిగుసుకు కూర్చున్నారు. ఇంకోవేపు పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కూడా అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ప్రకటించింది. ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్ మొదటి నుంచి కాంగ్రెస్‌ను ఓడించి ఆ పార్టీకి పలుకుబడి ఉన్న చోటల్లా తమ ఆధిపత్యం ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. జార్ఖండ్ లో ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గడం "ఇండియా" ఐక్య సంఘటనకు కూడా సానుకూలమైన అంశమే.

బడ్జెట్... కార్పొరేట్లకు వరం కౌలురైతులకు శాపం

పి.జమలయ్య

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ కౌలురైతులకు నిరాశ కలిగించింది. తమను గుర్తిస్తుందని, వ్యవసాయ పథకాలన్నీ వర్తింప చేస్తారని ఆశతో ఎదురు చూసిన కౌలురైతులు భంగపాటుకు గురయ్యారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి (పెట్టుబడి సాయం), ఫసల్ బీమా, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు, రుణ ఉపశమనం చట్టం, ప్రకృతి విపత్తుల సహాయం నిధి, ధరల స్థిరీకరణ నిధి లాంటి పథకాలకు నిధులు పెంచి చోటు కల్పిస్తారని ఆశించిన కౌలురైతులకు కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది.

ప్రధాని పేదలు, మహిళలు, యువత, అన్నదాతలు వీరు పురోగమిస్తేనే దేశం పురోగమిస్తుందని 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధిస్తామని అనేక ఆకర్షణీయ మాటలు మోదీ పలికారు. అన్నదాతలైన కౌలు రైతులకు బడ్జెట్‌లో వొరిగిందేమీ లేదు. ఊకదంపుడు ఉపన్యాసాలతోనే ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కౌలురైతులకు శాపంగాను, కార్పొరేట్లకు వరంగా మారింది. రైతులకు పెద్ద పీట వేశామని చెబుతూనే కార్పొరేట్ రంగానికి ఎర్ర తివాచీ పరిచారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కౌలు వ్యవసాయం గణనీయంగా పెరుగుతున్నది. వ్యవసాయమంటేనే కౌలు వ్యవసాయమని, ఇందులో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతుల సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని, కౌలురైతులను నిర్లక్ష్యం చేయటం తగదని... ఇప్పటికైనా పున:పరిశీలించి కౌలురైతుల సంఖ్యను, వారు సాగు చేస్తున్న భూమిని దృష్టిలో పెట్టుకొని దామాషా పద్ధతిలో నిధులు కేటాయించాల్సిన ఆవశ్యకత ఉంది.

2024-2025 సంవత్సరానికి కేంద్రమంత్రి ప్రవేశ పెట్టిన రూ.47.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ విభాగానికి కేటాయించింది కేవలం రూ. 1.27 లక్షల కోట్లు. గత బడ్జెట్ కంటే 0.65% మాత్రమే పెరిగింది. గత ఐదు సంవత్సరాల బడ్జెట్లను పరిశీలిస్తే వ్యవసాయ, అనుబంధం రంగాల్లో కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయి. 2019-2020 సంవత్సరంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు 5.44% కేటాయిస్తే 2024-2025 సంవత్సరానికి కేవలం 3.08 శాతం మాత్రమే కేటాయించి చేతులు దులిపేసుకున్నారు. 2019 నుండి వరుసగా వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు బడ్జెట్ తగ్గించుకుంటూ వస్తూనే ఉన్నారు. బడ్జెట్ కేటాయింపులే కాదు, ఖర్చు పెట్టకుండా నిధులను మురగ పెడుతున్నారు. 2018 నుంచి 2022 వరకు పరిశీలిస్తే వ్యవసాయ రంగానికి కేటాయించిన కేటాయింపులలో సుమారు రూ. 1 లక్ష 5 వేల కోట్లను ఖర్చు చేయకుండా తిరిగి అప్పగించడం అంటే రైతులు మీద ఎటువంటి ప్రేమ ఉందో అర్థమవుతుంది. దేశంలో రోజుకు 30 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రతి రైతు కుటుంబం 90 శాతం అప్పుల్లో కూరుకుపోయారు. రైతాంగాన్ని ఆత్మహత్యల నుంచి కాపాడటానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేకపోవడం శోచనీయం. దిగుబడులు నిల్వ చేయటం, సరఫరా మార్గాలు, ప్రాథమిక, సెకండరీ స్థాయిలో ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి వాటిలో ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్యాన్ని పెంచి పోషించేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయటం అంటే భవిష్యత్తులో వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్లకు అప్పగించడం తప్ప మరొకటి కాదు. చిన్న, సన్నకారు కౌలు రైతుల గురించి ఈ బడ్జెట్‌లో ఊసేలేదు. రైతు ఉద్యమాన్ని చూసి భయపడి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినప్పటికీ దొడ్డిదారిన ఆ నల్ల చట్టాలను అమలు చేస్తున్నారు. వ్యవసాయానికి ప్రాథమికమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాల రేట్లు విపరీతంగా పెంచేశారు. వీటిపై 18శాతం జీఎస్టీతో ధరలు పెరిగి సాగు భారమైంది. వ్యవసాయానికి మూలాధారమైన ఎరువుల సబ్సిడీలు కూడా తగ్గుతూ వస్తున్నాయి. 2022-23 సంవత్సర బడ్జెట్లో రూ.2,51339 కోట్లు కేటాయించగా 2023-2024 సంవత్సరంలో రూ.1,88,894కు తగ్గించారు. 2024-25 ఏడాదికి రూ.1,64,000 కోట్లు కేటాయించి చేతులు కడిగేశారు. వ్యవసాయంలో ఎక్కువగా వాడే యూరియాకు కూడా బడ్జెట్లో నిధులు తగ్గించుకుంటూ వస్తూనే ఉన్నారు. కౌలురైతులకు, చిన్న, సన్న కారు రైతులకు పరపతి సౌకర్యం అందటం లేదని, వడ్డీ వ్యాపారుల కనుసన్నల్లోనే వ్యవసాయం చేస్తున్నారని, ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా రైతులను ఎలా అదుకుంటారు?. ఇది పెద్ద ప్రశ్నగా మిగిలి పోతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం, కౌలు రైతులకు ఎటువంటి షూరిటీ లేకుండానే రూ.1,60,000 మేరకు ప్రతి కౌలురైతుకు పంట రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంది. కానీ ఎక్కడా అమలు చేసిన పరిస్థితిలేదు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ప్రకృతి విపత్తులు సంభవించి రైతుల కష్టార్జితం బుగ్గిపాలవుతుంటే విపత్తుల నుండి ఆదుకోవడానికి ఎటువంటి సహాయ సహకారాలు అందించకుండా, రైతుల సంక్షేమం గురించి ఆలోచిస్తున్నామని ప్రకటించటం వొట్టి బూటకం. ఆరుగాలం కష్టపడి పంటల పండించి మార్కెట్‌కి తీసుకొస్తే వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి రైతుల శ్రమను దోచుకు తింటుంటే మద్దతు ధరలకు ప్రకటించి దానికి చట్టబద్ధత కల్పించి రైతులకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వం మార్కెట్ శక్తులకు లాభసాటిగా ఉండే విధంగా వ్యవహరించడం అంతకన్నా ఘోరం మరొకటి లేదు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇ-నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) ఆచరణలో మధ్య దళారులకు ఉపయోగపడుతుంది. మాటల్లో రైతుల గురించి, చేతల్లో కార్పొరేట్ ప్రయోజనాల గురించి ఆలోచించడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పెట్టుబడి సాయం)పథకాన్ని కౌలురైతులకు వర్తింప చేయక పోవడం అన్యాయం. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం, ప్రతి సంవత్సరం రైతులు, కౌలు రైతులందరిని కలుపుకుంటే రూ.75 వేల కోట్ల అవసరం. కానీ గత రెండు సంవత్సరాలుగా రూ.60 వేల కోట్లు కేటాయించి సరిపుచ్చుతుంది.

పంటల భీమా పథకం సంబంధించి 2022 -24 లో బడ్జెట్ లో రూ.15000 కోట్లు కేటాయించగా దాన్ని 2024-25 బడ్జెట్ లో రూ.14600 కోట్లుకు తగ్గించారు. ప్రైవేట్ బీమా కంపెనీలకు ఉపయోగపడే పద్ధతుల్లో పంటల భీమా పథకం ఉంది ప్రస్తుతం ఉన్న పథకాన్ని సవరించి సమగ్ర పంటలు కావాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. రైతులకు మద్దతు ధరలు అందించే పీఎం ఆశా పథకానికి కూడా ఈ బడ్జెట్‌లో 21శాతం నిధులు తక్కువ కేటాయించారు. పదివేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు గత సంవత్సరం రూ.9505 కోట్ల కేటాయించి సవరించిన బడ్జెట్లో రూ.450 కోట్లు కుదించారు. ఈ సంవత్సరం ఏకంగా 39.10% (రూ.584 కోట్లు)తక్కువగా కేటాయించి చేతులు ఎత్తి వేశారు. కౌలురైతుల్లో ఎక్కువ వ్యవసాయ కార్మికులే. అటువంటి వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామీణఉపాధి హామీ పనులకు వెళ్తుంటారు కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పథకానికి నిధులను పెంచడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ఠ పరిచి అందరికీ ఆహార బాక్స్ ఏర్పాటు చేసి మరింత సహాయం అందించాలి కానీ 2023 -24 బడ్జెట్ లో రూ. 1,37,36 కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం బడ్జెట్లో లక్ష కోట్లు కేటాయింపులు చేశారు. వీటితో పాటు ఇన్‌పుట్స్ సబ్సిడీ, పంటల రుణాలు, భీమా పరిహారం, పంటలు అమ్ముకోవడానికి వెసులుబాటు లేకపోవడంతో కౌలురైతులు నష్టపోతున్నారు. కేరళ తరహ పద్ధతుల్లో కౌలు రైతుల సాగు కోసం చేసిన అన్ని రకాల అప్పులను మాఫీచేసి ఆత్మహత్యల నుండి రక్షించడానికి రుణ ఉపశమన చట్టం తక్షణం చేయాలి..

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి

లంకెబిందెలు

చింతపట్ల సుదర్శన్

సూర్యుడి కిరణాలు సీబీఐ వారి ప్రశ్నల్లా చెట్ల ఆకుల్ని వేడిగా గుచ్చుకుంటున్నాయి. మెరిసే ఎండలో నోటితో ఏదో పట్టుకుని అరుగువైపు ఉరికివస్తున్న డాగీవైపు పరిశోధనాత్మకంగా చూడసాగింది డాంకీ. దీనికివ్వాళ తిండి ఎక్కువైనట్టుంది. కడుపులో జాగాలేక నోటితో పట్టుకొస్తున్నట్టుంది అనుకున్న డాంకీ, డాగీ నోట్లో మందంగా నలుచదరంగా మెరుస్తున్న వస్తువు బేకరీలో కొట్టుకువచ్చిన 'బన్ను' కావచ్చు ననుకంది.

వరుగువరుగున వచ్చి అరుగు ఎక్కిన డాగీ తన నోట్లో ఉన్న వస్తువుని డాంకీ ముందు పడేసి 'ఎంజాయ్' అని అరిచింది. అప్పుడు గానీ అర్థం అవలేదు అదేమిటో. కట్టగా కట్టిన కొత్త కాగితాల కట్ట అది. ఉత్తి కాగితాల కట్టకాదది జనం నానా గడ్డీమేసి కూడబెట్టే కరెన్సీ కట్టఅది. ఇదేమిటిది? నా ముందు పడేశావు? అంది డాంకీ. నీ కోసమే అట్టుకొచ్చేను. ఆకలైతే ఇప్పుడే తినెయ్యి, కాకపోతే డిన్నర్ టైంలో నమిలెయ్యి నీ కోసం ప్రేమతో తెచ్చానిది. నా లైఫ్‌లో

రంగస్థలం

నేను నీకిస్తున్న మొట్ట మొదటి గిఫ్ట్ ఇదే అంది డాగీ గర్వంగా తోక ఊపుతూ. గిఫ్టా, మరీ ఇంత ఖరీదైనదా. ఇది ఉత్తి కాగితాల కట్టకాదురోయ్ అన్నీ కొత్త ఐదువందల నోట్లు. లెక్కగడితే యాభైవేలు అనగా అరలక్ష దీన్ని నమలమంటున్నావా. ఏం నమిలితే ఏం? అయినా వీటి విలువ ఎంతయితే నీకేంటి నాకేంటి? నీకివి ఉత్తుత్తి కాగితాలే. పైగా ఓ పద్ధతిగా ఉన్నాయి. మరో ఆలోచన లేకుండా నమిలేసెయ్యి అంది డాగీ. ఇది మనుషుల మాత్రమే తినే గడ్డి గాడిదలు తినేదికాదు. అయినా ఎక్కడ్నించి కొట్టుకొచ్చావు 'ఏటీఎమ్'లో మూతి పెట్టవా? ఏటీఎమ్‌లు బద్దలు కొట్టడం, కార్డులు కొట్టేయడం మనుషులు చేసే దగుల్బాజీ పనులు.

నేనెందుకు చేస్తాను? మరి ఎక్కడివివి. దారిన పోతున్న దానయ్యదగ్గర నోటివాటం చూపేవా?అంది డాంకీ, కాదు నేనేం జేబు దొంగనీ, గల్లీ లీడర్నికాను. ఇది దొంగ సొమ్ముకాదు, దొరికిన సొమ్ము, దొరికిన దొంగ దొంగసొమ్మా మరి? అయితే అయి ఉండవచ్చు. ఐ డోంట్ నో. పెద్దోళ్లు ఉండే పెద్ద బంగళాల కాలనీలో ఓ విల్లా గేట్ ముందు నోట్లని వ్యాన్‌లోకి ఎక్కిస్తున్నాడు. ఒకటి రోడ్డు మీద పడితే బన్నులా ఉన్నా ఉన్న దీని మీద కన్నుపడింది. కాగితాలు నమిలితే నువ్వు గుర్తొచ్చేవు. 'ఎ ఫ్రెండు ఇన్ నీడ్ ఈజ్ ఎ ఫ్రండ్ ఇండీడ్' అని తెచ్చేశానంతే.

ఇప్పుడర్థమైంది. ఆ బంగాళాబాబు ఇంటిమీద 'రెయిడ్' అయింది. కప్‌బోర్డులనుండా కట్టలుకట్టలుగా ఉందట డబ్బు. డబ్బేకాదు. కిలోల లెక్కన బంగారమూ, దస్తాల లెక్కన భూ సంబంధ డాక్యుమెంట్లూ దొరికేయంట. నిన్నట్నించీ సోదాలు మొదలైనాయిలే. నువ్వంటే పేపర్ చదువుతావుకదా అన్నీ తెలుస్తయి. ఇంతకీ వాడెవడో డబ్బు జమ చేసుకుంటే ఈళ్లెందుకు సోదా చెయ్యాలి అంది డాగీ. అంది సంపాదించేవాడి కష్టార్జితం కాదు! సక్రమంగా చెయ్యాల్సిన పనిచెయ్యకుండా, అక్రమంగా చెయ్యకూడనిపని చెయ్యడానికి తీసుకున్న లంచమనెడి బహుమానమన్నమాట. ఇంగ్లీషువాడు మనవాళ్లకు అంటించిన ఒక మాయరోగం అన్నమాట అంది డాంకీ. ఇప్పుడు విషయం పూర్తిగా అర్థమైంది. ఎలక్షన్లప్పుడు ఓటు వెయ్యడానికి లీడర్లు బహుమతి అనబడే లంచం ఇస్తారుగదా ఓటర్లకి. అనవసనవను ఉచితాలపేర జనాల ఓట్లు కొల్లగొట్టుడానికి ఇచ్చేవి కూడా లంచమే అసలీ భూ ప్రపంచమంతా లంచం చుట్టూనే తిరుగుతున్నది అని డాంకీ అంటుండగానే అరుగుఎక్కాడు అబ్బాయి.

ప్రజలసొమ్ము దోచుకోడానికి నాయకులు, ఉన్నత పదవుల్లో ఉన్న ఉద్యోగులూ పోటీపడుతున్నారు. వీళ్ల వెనక వాళ్లు, వాళ్లని నమ్ముకుని వీళ్లు ప్రజల్ని అమ్ముకుంటున్నారు. కప్‌బోర్డుల్లో వీళ్లూ వాళ్లూ లంకెబిందెలు దాచుకుంటున్నారు అన్నాడబ్బాయి. లంకెబిందలా ఈ కాలంలో కూడానా అంది డాంకీ. కోట్ల రూపాయల ఖరీదుచేసే, అనేక ఎకరాల డాక్యుమెంట్లు లంకెబిందెలే మరి తరతరాలకూ తరగని సిరి మరి అన్నాడబ్బాయి.

ప్రజల సొమ్ము పాపపు సొమ్మేకాదు, దొంగసొమ్ము కూడా. రోడ్డు మీద దొరికే చెత్తకాగితాలైనా తింటానుకాని ఈ నోట్లు తిని కడుపునొప్పి తెచ్చుకోను అంది డాంకీ. నిరుద్యోగివైనా నిజాయితీ ఉన్న మనిసివి అన్నా, నువ్వూ ఈ సొమ్ము ముట్టుకోవు నాకు తెల్సు. దీన్నిపట్టుకుపోయి ఆ వ్యాన్ దగ్గరేపడేసి వస్తానని నోట్లకట్టని నోటితో పట్టుకు బయలుదేరింది డాగీ.

మనం మరిచిన మరో గాంధీ-ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్



రెండు శతాబ్దాల బ్రిటిష్ వారి వలస పాలన నుండి భారతదేశ విముక్తికి పోరాటం చేసిన ఎందరో మహనీయులు అఖండ భారతావనిలో కుల,మత, ప్రాంతంతో పని లేకుండా యావత్ భారత్‌దేశ స్వతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహనీయుడు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్. అహింసను అనుసరించి గాంధీజీ సత్యాగ్రహ బాటలో ప్రయాణించిన మహనీయుడు మన గఫార్ ఖాన్(సరిహద్దు గాంధీ). పార్టీ అధ్యక్ష పదవిని త్యజించి, ప్రజాసేవయే పరమార్థంగా ఐక్య భారత్ కోసం ఆంగ్లేయులను ఎదిరించిన భారతదేశ రెండవ గాంధీ, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్. తమను పాకిస్తాన్‌లో కలుపుతుంటే తోడేళ్లకు మమ్ములను వదిలేస్తున్నారు అంటూ ఆవేదన చెందిన వ్యక్తి గఫార్ ఖాన్. ఆయన కన్నుమూసిన రోజున దేశాల మధ్య యుద్ధం ఆగిపోయింది సరిహద్దులు చెరిగిపోయాయి. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ ఖుదాయ్ ఖిద్మత్‌గార్ అని కూడా పిలుస్తారు. బ్రిటిష్ పాలన నుండి భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రముఖ నాయకుడు. 1890 ఫిబ్రవరి 6న ఉస్మాన్ జాయీ పెషావర్ వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో జన్మించిన ఖాన్, గాంధీజీ అహింసాత్మక పోరాటాలకు ప్రేరణ పొంది, భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 1915-1918 మధ్య 500 గ్రామాలను పర్యటించి విద్యా సామాజిక ఆవశ్యకతను తెలియజేశారు. 1929 లో ఖుదాయ్ ఖిద్మత్‌గార్ (దేవుని సేవకులు) అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థ హింసాత్మకతకు వ్యతిరేకంగా పోరాడటానిక, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేయడానికి పనిచేసింది. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఖాన్ అరెస్ట్ అయ్యారు. అయినప్పటికీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చేంతవరకు తన పోరాటం ఆగలేదు. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు మళ్లీ అరెస్ట్ అయ్యారు. 1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఖాన్ పాకిస్తాన్‌లో ఉండి, అక్కడ ప్రజాస్వామ్య స్థాపన కోసం బలమైన పోరాటం చేశారు. గఫార్ ఖాన్ సిద్ధాంతాలు హింసాత్మకతకు వ్యతిరేకంగా, అహింసాత్మక పోరాటాలకు బలమైన మద్దతు ఇచ్చారు. ఖాన్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటం చేశారు. మత సామరస్యాన్ని బలంగా నమ్మిన వ్యక్తి ఖాన్. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన నాయకుడు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటం చేసిన యోధుడు. ఖాన్ 1988లో పాకిస్తాన్‌లో మరణించారు. అఖండ భారత్‌ను ప్రేమించిన నాయకుడు దేశ విభజనను వ్యతిరేకించి ఎర్ర చొక్కాల ఉద్యమాన్ని ప్రారంభించిన ప్రముఖుడు, జాతీయవాది, భారతరత్న పొందిన మొదటి భారతేతరుడు. గాంధీ, నెహ్రూలకు అత్యంత ప్రీతిపాత్రుడు సరిహద్దు గాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ జీవితం ఎందరికో ఆదర్శప్రాయం.

(ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ జయంతి సందర్భంగా)

పూసపాటి వేదాద్రి
9912197694

కేజ్రీవాల్‌పై ఈడీ గురి

సుశీల్ కుట్టి

ఇప్పుడు ఎంఎల్ఏలు, ఎంపీల దగ్గర టన్నుల డబ్బు మూలుగుతోంది. బ్యాంకు ఖాతాల్లో లెక్కలేనంత ధనం ఉంటోంది. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోంది. లోకసభ ఎన్నికలకు ముందు ఏ విధంగానైనా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు కేంద్ర దర్యాప్తుసంస్థ రకరకాలుగా ప్రయత్నిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారానికి వచ్చిననాటినుంచి ప్రత్యర్థి ప్రభుత్వాలను కూల్చివేయడానికి రకరకాలు వ్యూహాలను పన్నారు. బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ఎంఎల్ఏల సంఖ్య తగ్గితే, డబ్బు ఎరవేసి పార్టీ మార్పును చేయించడం మామూలుగా జరుగుతున్న ప్రక్రియ. ఇటీవల ఏడుగురు ఆప్ ఎంఎల్ఏలను తమ పార్టీలో జేర్చుకునేందుకు డబ్బు ఎరవేయడమే కాకుండా ఆప్‌ను బీజేపీలోకి చేర్చుకునేందుకు తమపై ఒత్తిడి చేస్తున్నారని కేజ్రీవాల్ వెల్లడించారు. ఒక్కొక్క ఎంఎల్ఏకి 26కోట్ల రూపాయలు ఆశచూపారని కేజ్రీవాల్, ఇతరులు ఆరోపించారు. కనీసం 25 మంది ఆప్ ఎంఎల్ఏలను పార్టీ మార్పిడిచేయించేందుకు ఒత్తిడిచేస్తున్నారని కేజ్రీవాల్, ఆతిషి మర్లీనా ఆరోపించారు. దర్యాప్తు సంస్థ విచారణకోసం కేజ్రీవాల్‌కు నోటీసు ఇచ్చినప్పటికీ ఆయన ఇంతవరకు హాజరుకాలేదు. దర్యాప్తు సంస్థకి, కేజ్రీవాల్‌కి మధ్య దాగుడుమూతలు సాగుతున్నాయి. ఢిల్లీలోనే కాకుండా పంజాబ్‌లోనూ ఇలాంటి క్రీడ సాగుతోంది. సాధారణప్రజలు కూడా ఆప్‌కి ఓటు చేస్తున్నట్లు ప్రజలు చూస్తున్నదే. కేజ్రీవాల్ ప్రభుత్వంపైన మోదీ ప్రభుత్వం చాలాకాలంగా గురిపెట్టింది. బీజేపీలో చేరాలని తనపై బీజేపీ ప్రభుత్వం వత్తిడిచేస్తున్నదని కేజ్రీవాల్ ఆరోపించగా, బీజేపీ ఈ ఆరోపణను తిరస్కరించింది. తాను బీజేపీలో చేరేదిలేదని, బీజేపీ ప్రభుత్వం ఏమిచేసినా ఒత్తిడికి లొంగనని కేజ్రీవాల్



అన్నారు. ఎలాంటి కుట్ర చేసినప్పటికీ నేను దృఢంగా ఉంటానని బీజేపీలోచేరే ప్రశ్నేలేదని కేజ్రీవాల్ అన్నారు. తాను అబద్ధాలు చెపుతున్నానని ఎవరు నిరూపించగలరు? అసోం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వాస్‌శర్మ, బీజేపీ ఎంఎల్ఏ సువేందు అధికారి ఒత్తిడి పెడుతున్నారని కేజ్రీవాల్, ఇతర ఎంఎల్ఏలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి హిమంత్ బిశ్వాస్ శర్మను బీజేపీలో చేర్చుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ముకుల్ రాయ్, సువేంద్‌ను కూడా బీజేపీ వెంటాడి తమ పార్టీలో చేర్చుకుంది. తాజాగా హేమంత్‌సొరేన్‌ను అరెస్టు చేయడంలో ఈడీ విజయవంతంగా పనిచేసింది. ఎన్‌సీపీ నాయకుడు శరద్‌పవార్, రోహిత్‌పవర్‌పైన కూడా ఈడీ ఎక్కుపెట్టింది. అలాగే ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్‌పైన కూడా ఈడీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్నికలకు ముందు అనేక రాష్ట్రాల నాయకులపైన బీజేపీ దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్న విషయం అందరికీ తెలుసు. కేజ్రీవాల్ బీజేపీలో చేరినట్లయితే ఆయనపైన ఉన్న కేసులను తక్షణం మాఫీ చేస్తారు. తొలినుంచి బీజేపీ చేస్తున్నపని ఇదే. ఎంతటి అవినీతిపరుడైనా బీజేపీలో చేరితే గంగలో మునిగి పవిత్రుడవుతాడు. ఏ పార్టీనైనా బీజేపీ తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఏర్పడింది. కేజ్రీవాల్ పరిస్థితులు మెరుగ్గా ఉండకపోతే ఆయనను అరెస్టుకాకుండా నిలవరించడం కష్టమేనని అంటున్నారు. ఢిల్లీ ప్రభుత్వ ఉపముఖ్యమంత్రి మనీష్‌సిసోడియా మరో మంత్రి సంజయ్‌సింగ్‌లను కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న తర్వాత వారిని ఎవరూ అరెస్టుకాకుండా కాపాడలేకపోయారు. కేజ్రీవాల్‌మీద అవినీతి ఆరోపణలు చేసి నిరూపించడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక వ్యూహాలు పన్నుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై రెండువైపుల నుంచి దెబ్బలుతగులుతున్నాయి. మొదటిది ఢిల్లీ క్రైం బ్రాంచి పోలీసులు ఆయనకోసం వేటాడుతున్నారు. వివిధరకాల అబద్ధాలతో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసేందుకు తహతహలాడుతున్నారు. ఏడుగురు ఆప్ ఎంఎల్ఏలను ఒక్కొక్కరికి 25కోట్లు చెల్లించి బీజేపీ కొనుగోలు చేయడానికి ప్రయత్నించినట్లు కేజ్రీవాల్ నిరూపించగలరా? అని బీజేపీ ప్రశ్నిస్తోంది. మద్యం కుంభకోణంలో అనేకమంది ఆప్ నేతలు భాగస్వాములని ఆరోపిస్తున్నారు.

మణిపూర్ ప్రజలను దెబ్బకొట్టింది

బీజేపీ 'డబుల్ ఇంజన్' ప్రభుత్వంపై ఖడ్గే

న్యూఢిల్లీ: మణిపూర్‌లో పరిస్థితిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే సోమవారం విరుచుకుపడ్డారు. బీజేపీ 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం మణిపూర్ ప్రజలను అనేక దెబ్బలు కొట్టిందని ఆరోపించారు. 'మణిపూర్‌లో ఎడతెగని హింస అసంఖ్యాక జీవితాలను నాశనం చేసి 9 నెలలు అయ్యింది. కానీ ప్రధాని మోదీ రాష్ట్రాన్ని సందర్శించడానికి గంట సమయం లేదు. ఎందుకు? అతను చివరిసారిగా 2022 ఫిబ్రవరిలో మణిపూర్‌లో ఎన్నికల ప్రచారం కోసం మాత్రమే పర్యటించాడు. ఇప్పుడు తమను తాము రక్షించుకోవడానికి మణిపూర్ ప్రజలను విడిచిపెట్టారు' అని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. మే 4, 2023 నుంచి 200 మందికి పైగా మరణించారు. 60 వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. 'సుమారు 50 వేల మంది ప్రజలు తగిన వైద్య సదుపాయాలు, ఆహారం లేకుండా దుర్భరమైన పరిస్థితులలో సహాయక శిబిరాల్లో మగ్గుతున్నారు. ప్రజలు ఇప్పటికే తమ ఇళ్లు, వారి జీవనోపాధి, వారి వస్తువులను కోల్పోయారు. వారు ఎక్కడికీ వెళ్లలేరు. వారి భవిష్యత్తు అంధకారమైంది' అని ఖడ్గే అన్నారు. కొన్ని నివేదికల ప్రకారం, గాయం, పోషకాహార లోపం, అనారోగ్యం కారణంగా ఒక్క చురాచంద్‌పూర్‌లోని శిబిరాల్లో 80 మందికి పైగా మరణించారు. ఇంఫాల్ శిబిరాలు అంత మంచివి కావని, శిబిరాల్లో ఏ సహాయం అందించబడుతున్నా అది స్వచ్ఛంద సంస్థల సమష్టి ప్రయత్నాల వల్ల వచ్చిందే తప్ప రాష్ట్ర ప్రభుత్వం కాదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ చూపుతున్న పూర్తి ఉదాసీనత, నిర్లక్ష్యం కారణంగా మహిళలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని ఖడ్గే విమర్శించారు. 'జనవరి 1 నుంచి మళ్లీ హింసాత్మక ఘటనల్లో 10 మంది చనిపోయారు.

రెండు వర్గాలకు చెందిన పోలీసు ట్రయినీలు ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకుంటున్నారు. ఏడుగురు గాయపడ్డారు. జనవరి 24న మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడిపై క్రూరంగా దాడి చేసి చిత్రహింసలకు గురిచేసిన భారీ కాపలా ఉన్న కాంగ్లా కోట వద్ద జరిగిన సమావేశానికి హాజరు కావాలని సాయుధ బృందం ఎంపీలు/ఎమ్మెల్యేలను ఎలా

బలవంతం మనం చూశాం' అని ఖడ్గే వివరించారు. 'ఆగస్టు 2023లో మణిపూర్ ప్రజలకు ప్రధాని మోదీ పార్లమెంటులో ఇచ్చిన హామీ బూటకమని స్పష్టమైంది. కనుచూపు మేరలో సాధారణ, శాంతి పరిస్థితులు లేవు' అని అన్నారు. మణిపూర్‌లో పరిస్థితిపై ప్రధాని 'పూర్తి మౌనం' కొనసాగిస్తున్నారని, అక్కడి ప్రజలకు ఆయన 'భయంకరమైన అన్యాయం' చేశారని కాంగ్రెస్ ఆదివారం ఆరోపించింది. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ హోం మంత్రి అమిత్ షాను కలిసిన ఒక రోజు తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ విమర్శల దాడి చేసింది. షెడ్యూల్డ్ తెగ హోదా కోసం మెజారిటీ మైతేయి సామాజిక వర్గం డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాలలో గిరిజన సంఘీభావ యాత్ర నిర్వహించిన తర్వాత మే 3, 2023న మణిపూర్‌లో జాతి హింస చెలరేగింది. అప్పటి నుంచి కొనసాగుతున్న హింసలో 200 మందికి పైగా మరణించారు.

'నియంత' అహంకారాన్ని బద్దలుకొట్టిన జార్ఖండ్: కాంగ్రెస్

న్యూఢిల్లీ: జార్ఖండ్ 'నియంత' అహంకారాన్ని బద్దలు కొట్టిందని కాంగ్రెస్ సోమవారం పేర్కొంది. చంపై సోరెన్‌కు చెందిన జేఎంఎం-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గెలిచిన వెంటనే ఈ వ్యాఖ్యలు చేసింది. 'జార్ఖండ్ 'నియంత' అహంకారాన్ని బద్దలు కొట్టింది. భారతదేశం గెలిచింది. ప్రజలు గెలిచారు. 'ఇండియా' సంకీర్ణ ప్రభుత్వం ఈరోజు అసెంబ్లీలో విశ్వాస పరీక్షలో గెలిచింది. మీ అందరికీ చాలా అభినందనలు. జై జోహార్' అని కాంగ్రెస్ విశ్వాస ఓటు వేసిన వెంటనే 'ఎక్స్'లో హిందీలో పోస్ట్ చేసింది. జార్ఖండ్‌లోని జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం విశ్వాస ఓటును గెలుచుకోవడంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ 'మేం చాలా నమ్మకంగా విశ్వాస పరీక్షలో విజయం సాధించాం. బీజేపీ ఆపరేషన్ కమలం విఫలమైంది. ముందుగా హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసి రాజీనామా చేయించారు. ఆ తర్వాత చంపై సోరెన్ ప్రమాణ స్వీకారాన్ని వారు ఆలస్యం చేశారు' అని ఆయన విమర్శించారు. 'ఈ ప్రభుత్వం మిగిలిన ఒక సంవత్సరం పాటు మనుగడ సాగిస్తుంది. మేము చేసిన పని ఆధారంగా పునరుద్ధరించబడిన ఆదేశం కోసం మేము జార్ఖండ్ ప్రజల వద్దకు వెళతాము' అని చెప్పారు. తమిళనాడు, కేరళ, మణిపూర్, జమ్ముకాశ్మీర్ లేదా బీహార్ అయినా గవర్నర్లు తమ పాత్రలో 'పక్షపాతం' కలిగి ఉన్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వారికి ఏమి చెబితే అది వారు చేస్తారని అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ జార్ఖండ్ అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో 'ఇండియా' కూటమి విజయం ప్రజల శక్తిని రుజువు చేస్తుందన్నారు. 'మేము ప్రజాభిప్రాయంతో ఎన్నుకోబడిన ప్రభుత్వం, ఈడీ ప్రజల గొంతును తిప్పికొట్టలేదు. ఈడీ వంటి తమ సంస్థలను ఉపయోగించి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు కేంద్రం చేస్తున్న ఫాసిస్ట్ ప్రయత్నాలను పూర్తి శక్తితో ప్రతిఘటిస్తారు. వారు జార్ఖండ్‌లో ఆదివాసీలు, వెనుకబడిన, పేద ప్రజల ప్రభుత్వంపై దాడి చేశారు. వారు లోక్‌సభ ఎన్నికల్లో వారి ఆగ్రహాన్ని ఎదుర్కొంటారు' అని వేణుగోపాల్ 'ఎక్స్'లో పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, రాహుల్ గాంధీ రాంచీలో మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్‌ను కలిశారు.

హేమంత్ సోరెన్ భార్యను కలిసిన రాహుల్

రాంచీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్‌ను కలిశారు. మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసిన కొన్ని రోజుల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. జేఎంఎం-కాంగ్రెస్-ఆర్‌జేడీ-సీపీఐ(ఎంఎల్) కూటమి రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస పరీక్షలో బీజేపీని సునాయాసంగా ఓడించిన కొన్ని నిమిషాల తర్వాత, ఇక్కడి హెచ్ఈసీ కాంప్లెక్స్‌లోని చారిత్రాత్మక షహీద్ మైదాన్‌లో బహిరంగ ర్యాలీకి కొన్ని నిమిషాల ముందు గాంధీ కల్పనా సోరెన్‌ను కలిశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్) జైరాం రమేశ్ తెలిపారు. కల్పనా సోరెన్‌తో గాంధీ చిత్రాన్ని కూడా ఆయన పంచుకున్నారు. ఇదిలాఉండగా, సోమవారం హేమంత్ సోరెన్ తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను రుజువు చేయాలని అసెంబ్లీ వేదికగా బీజేపీకి సవాలు విసిరారు. ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో సోరెన్‌ను రాంచీలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు శుక్రవారం ఐదు రోజుల ఈడీ కస్టడీకి పంపింది.

బొగ్గు రవాణా కార్మికులతో రాహుల్ ముఖాముఖి

జార్ఖండ్‌లో కాంగ్రెస్ భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతోంది. యాత్రకు సారథ్యం వహిస్తున్న రాహుల్ గాంధీ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ వారితో మమేకమవుతున్నారు. తాజాగా ఆయన బొగ్గు రవాణా కార్మికులతో కలిసి ముచ్చటించారు. వారితో అడుగులో అడుగు వేశారు. సైకిళ్లపై టన్నుల బరువు మోసుకెళ్తున్న కార్మికుల కష్టాన్ని తెలుసుకునేందుకు సైకిల్ నడిపారు. ఎక్స్ ఖాతాలో రాహుల్ ఇందుకు సంబంధించిన ఫోటోలు షేర్ చేశారు. ప్రతిరోజూ 200 కిలోల బరువున్న బొగ్గు మూటలతో 30 నుంచి 40 మీటర్లు ప్రయాణం సాగించే కార్మికుల ఆదాయం చాలా స్వల్పమని, వారితో కలిసి నడవకుండా, వారి బరువు బాధ్యతలు పంచుకోకుండా వారి సమస్యలను అవగాహన చేసుకోలేమని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం జార్ఖండ్‌లోని రామ్‌గఢ్‌లో రాహుల్ భారత్ జోడో యాత్ర జరుగుతోంది. సోమవారం తన పర్యటనలో భాగంగా 1857 జార్ఖండ్ రివల్యూషన్‌లో అమరులైన షేక్ భిఖారి, తికైత్ ఉమ్రావ్ సింగ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

పోటీ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే పదేళ్లు జైలు... రూ.కోటి జరిమానా: కేంద్రం



న్యూఢిల్లీ: పోటీ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడేవారిపై కేంద్రం కొరడా కఠినంగా వ్యవహరించనున్నది. అక్రమార్కులను అడ్డుకునేందుకు వీలుగా పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనికింద నేరం రుజువైతే గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, రూ.కోటి జరిమానా విధించనుంది. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు వ్యవస్థీకృత ముఠాలు, మాఫియాపై ఉక్కుపాదం మోపనుందని మంత్రి జితేంద్రసింగ్ చెప్పారు. నిందితులతో చేతులు కలిపిన ప్రభుత్వ అధికారులను కూడా శిక్షిస్తామన్నారు. రాజస్థాన్, హరియాణా, గుజరాత్, బీహార్ వంటి రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాల లీకేజీల కారణంగా అనేక పోటీ పరీక్షలు వాయిదా పడటంతో కేంద్రం ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. కంప్యూటరైజ్డ్ పరీక్షల ప్రక్రియను మరింత సురక్షితంగా మార్చే దిశగా సిఫార్సుల నిమిత్తం ఉన్నతస్థాయి జాతీయ సాంకేతిక కమిటీని ఇందులో ప్రతిపాదించారు. పబ్లిక్ ఎగ్జామినేషన్ సిస్టమ్‌లో పారదర్శకత, విశ్వసనీయత తీసుకువచ్చే లక్ష్యంతో కేంద్రం ఈ బిల్లు తెచ్చిందని, నిజాయతీతో చేసే ప్రయత్నాలకు తగిన ప్రతిఫలం లభిస్తుందని, తమ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని యువతకు భరోసా ఇవ్వడమే దీని ఉద్దేశమన్నారు. ఈ బిల్లు లక్ష్యం విద్యార్థులు కాదని స్పష్టం చేశారు. జనవరి 31న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంలో ఈ బిల్లు గురించి ప్రస్తావించారు. పరీక్షల్లో అవకతవకల విషయంలో యువత ఆందోళన ప్రభుత్వానికి తెలుసని, ఈ సమస్యపై కఠినంగా వ్యవహరించేందుకు కొత్త చట్టం రూపొందించాలని నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు.

జీఎస్టీ వాటా విడుదలపై వివక్ష

- అధీర్ రంజన్ చౌదరి విమర్శ
- రాజకీయ లబ్ధికోసమే విమర్శలు: నిర్మల

న్యూఢిల్లీ: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. జీఎస్టీ వాటా విడుదల చేయకుండా బీజేపీ యేతర పార్టీల పాలిత రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని అధీర్ విమర్శించారు. దక్షిణ భారతదేశంపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని మండి పడ్డారు. దీనిపై సీతారామన్ స్పందిస్తూ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకే నిధులు విడుదలవు తాయని, ఇష్టానుసారం కుదరదని చెప్పు కొచ్చారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ఎంపీ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని ఎదురుదాడికి దిగారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆర్థిక సామర్థ్యంపై లోక్‌సభలో సోమ వారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధీర్ రంజన్ మాట్లాడుతూ బీజేపీ యేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలకు కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు పెద్దమొత్తంలో పెండింగ్ ఉన్నాయన్నారు. దీనికి కర్నాటకే ఉదాహరణ అని చెప్పారు. అక్కడ బీజేపీ అధికారంలో ఉన్నంతవరకు ఎప్పటికప్పుడు జీఎస్టీ చెల్లింపులు జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఆ ప్రస్తావనే లేదని విమర్శించారు. 2024 మధ్యంతర బడ్జెట్‌లోనూ కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపించిందని ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలను అధీర్ ప్రస్తావించారు. నిధులు విడుదల చేయకపో వడంతో 15వ ఆర్థికసంఘం కింద ఆ రాష్ట్రానికి రూ.11 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు సభకు వివరించారు. దీనిపై బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. దీనిపై సీతారామన్ స్పందిస్తూ తన ఇష్టప్రకారం కాకుండా ఆర్థికసంఘం సిఫార్సుల మేరకే నిధుల కేటాయింపు జరుగుతున్నట్లు అధీర్ అర్థం చేసుకోవాలన్నారు. ఎస్‌జీఎస్టీ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికే చెందుతుందని, సీజీఎస్టీ మాత్రం ఆర్థికసంఘం సలహామేరకు విభజిస్తా మని చెప్పారు. జీఎస్టీ వాటా విడుదలలోనూ దాని సిఫార్సులే పరిగణనలోకి తీసుకుంటామ న్నారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావుండదని చెప్పుకొచ్చారు. ఆరు నెలల క్రితం వరకు కర్నాటకలో అంతా సజావుగా సాగిందని అధీర్ చెబుతున్నారని, అందులో తప్పేముందని, చేయాల్సిన వాటిపై కాకుండా.. వేరే వాటిపై ఖర్చు చేసి... బకాయిలు రాలేదంటే ఎలా అని ఎదురు ప్రశ్నించారు. మీరే తప్పు చేసి... దానిని కేంద్రంపై నెట్టివేయడం సరికాదని వ్యాఖ్యానించారు. మధ్యమధ్యలో అధీర్ రంజన్ జోక్యం చేసుకుంటుండగా... ఆర్థిక సంఘం చెప్పనిదే తానేమీ చేయలేనని, తనకు విచక్షణ లేదనుకోవద్దని, ఇంకేమైనా కావాలనుకుంటే ఆర్థిక సంఘంతో మాట్లాడుకోండని కోపం ప్రదర్శించారు.

ఎన్నికల ప్రచారంలో చిన్నారులను ఉపయోగించొద్దు

రాజకీయ పార్టీలకు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) దేశంలోని రాజకీయపక్షాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏ రూపం లోనైనా చిన్నారులకు ఎన్నికల ప్రచారంలో ఉపయోగించవద్దని ఎన్నికల సంఘం హెచ్చరించింది. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో చిన్నారుల ప్రమేయాన్ని సహించేది లేదని స్పష్టం చేసింది. పోస్టర్లు అతికించడం, కరపత్రాల పంపిణీ, నినాదాలు చేయడం సహా ఎందులోనూ పిల్లలను ప్రచారంలో భాగం చేయవద్దని పార్టీలకు విజ్ఞప్తి చేసింది. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో చిన్నారుల ప్రమేయాన్ని సహించేది లేదని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. రాజకీయ నాయకులు, పోటీ చేసే అభ్యర్థులు తమ చేతులతో చిన్నారులను ఎత్తుకోవడం, వాహనంలో ర్యాలీలో పిల్లలను తీసుకెళ్లడం సహా ఏ పద్ధతిలోనైనా ప్రచార కార్యక్ర మాలకు పిల్లలను ఉపయోగించకూడదని సీఈసీ తెలిపింది. పద్యాలు, పాటలు, రాజకీయ పార్టీ, అభ్యర్థి చిహ్నాల ప్రదర్శనలకు కూడా పిల్లలను వినియోగించు కోవద్దని సూచించింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడంలో క్రియాశీల పక్షాలన్నీ భాగస్వాములు కావాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కోరారు. దివ్యాంగుల పట్ల గౌరవప్రదమైన ప్రసంగాలు చేయాలని కొన్నాళ్ల క్రితం కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు సూచించిన సంగతి తెలిసిందే.

గర్భ విచ్ఛిత్తికి ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ: తన 28 వారాల గర్భం తొలగించుకునేందుకు అనుమతించాలన్న ఓ అవివాహిత అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. 28 వారాల పిండంలో ఎలాంటి అసాధారణ లోపాలు లేవని, ఇలాంటి భ్రూణహత్యలను అనుమతించలేమని పేర్కొంటూ ఆ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ఆదేశాలు వెలువరించారు. పిండాన్ని తొలగించేందుకు చట్టబద్ధంగా 24 వారాలలోపే అనుమతి ఉండడంతో ఆమె 28వారాల పిండాన్ని తొలగించడానికి వైద్యులు నిరాకరించారు. దీంతో మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ప్రకారం తన 28 వారాల గర్భాన్ని అబార్షన్ చేసుకోవడానికి అనుమతించాలని ఆ యువతి హైకోర్టును ఆశ్రయించింది. ఆమె తరపు న్యాయవాది అమిత్ మిశ్రా మాట్లాడుతూ గర్భం దాల్చిన విషయం ఆమెకు తెలియదని, జనవరి 25న ఆమె 27 వారాల గర్భవతి అని తెలిసిందని చెప్పారు. యువతి అవివాహితురాలని, ఆమె గర్భం దాల్చిన విషయం ఆమె కుటుంబంలో ఎవరికీ తెలియదని, పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మహిళ మానసిక, శారీరక స్థితితో పాటు పిండం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ని వైద్య పరీక్షలకు ఆదేశించాలని ఆయన కోర్టును కోరారు.

బీజేపీతో నితీశ్‌ది 'అపవిత్ర పొత్తు'

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు ఆలం

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ రాష్ట్రంలో బీజేపీతో 'అపవిత్ర పొత్తు' పెట్టుకున్నారని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ సోమవారం ఆరోపించింది. బీహార్ అసెంబ్లీలో ఆ పార్టీ నాయకుడు మెహబూబ్ ఆలం మాట్లాడుతూ నితీశ్ కుమార్‌ను బీజేపీ 'హైజాక్' చేసిందన్నారు. 'ఎన్‌డీఏతో పొత్తు పెట్టుకోవడానికి నితీశ్ కుమార్‌ను బలవంతం చేసిన కారణాలను తెలుసు కోవడానికి మేము సమగ్ర విచారణను కోరుతున్నాం. అతని (నితీశ్) బలవంతం ఏమిటి... ('క్యా మజ్బూరియన్ థీ ఉంకీ') బీహార్ ప్రజలు దీనిని తెలుసుకోవాలనుకుంటు న్నారు. ఈ కూటమి అపవిత్రం, అసహజమైనది' అని ఆలం సోమవారం పీటీఐకి చెప్పారు. బీహార్‌లో మునుపటి మహాకూటమి ప్రభుత్వానికి చెందిన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌కు రాష్ట్ర అసెంబ్లీలో 12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కాగా, ఫిబ్రవరి 12న రాష్ట్ర అసెంబ్లీలో జరగనున్న విశ్వాస పరీక్షలో నితీశ్ ప్రభుత్వం గట్టెక్కుతుందా అని ప్రశ్నించగా, ఆలం మాట్లాడుతూ 'మేము (సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఎమ్మెల్యేలు) మూగ ప్రేక్షకుడిలా ఉండము. ఫిబ్రవరి 12న విశ్వాస పరీక్షలో నితీశ్ కుమార్ మనుగడ సాగించగలరా, లేదా అనేది కాలమే చెబుతుంది. బీహార్ ప్రజలు ఈ ద్రోహానికి పాల్పడిన నితీశ్ కుమార్‌ను క్షమించరు. ఇలాంటి రాజకీయ అవకాశవాదానికి ప్రజలు తగిన సమాధానం చెబుతారు' అని అన్నారు. 'నితీశ్ కుమార్ ఈ చర్య బీహార్ ప్రజలను అవమానించడమే. మేము దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం. ఇప్పుడు 'ఖేల్ 'ఖేలా' ప్రారంభం కాదు. ఫిబ్రవరి 12న నితీశ్ ప్రభుత్వం విశ్వాస పరీక్ష రోజున ఫలితం కోసం వేచి ఉండండి' అని తెలిపారు. బీహార్ కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తీసుకువెళ్లినట్లు వచ్చిన వార్తలపై ఆలంను ప్రశ్నించగా, కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయం అయినందున దీనిపై వ్యాఖ్యానించను. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఎమ్మెల్యేలకు సంబంధించినంత వరకు నేను పూర్తి విశ్వాసంతో చెప్పగలను. వారిని ఎవరూ వేటాడలేరు. మాది సిద్ధాంత ఆధారిత పార్టీ, అదే మా ఆస్తి' అని స్పష్టం చేశారు. నితీశ్ కుమార్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఫిబ్రవరి 12న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగానే విశ్వాస పరీక్షను కోరనుంది. నితీశ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి 128 మంది సభ్యులు బీజేపీ-జేడీయూ నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నారు. 243 మంది సభ్యుల బీహార్ అసెంబ్లీలో మెజారిటీకి మ్యాజిక్ ఫిగర్ 122.

పేటీఎంపై సీబీఐ, ఈడీ మౌనమేమిటి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: పేటీఎం అనుబంధ కంపెనీ పేటీఎమ్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్‌పై మనీలాండరింగ్ ఆరోపణల తర్వాత కూడా సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎందుకు మౌనం వహించాయో చెప్పాలని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేసింది. పేటీఎం వ్యవస్థాపకుడు... ప్రధాని మోదీ భక్తుడని, ప్రధానితో సెల్ఫీలు దిగడమే కాకుండా ప్రధానికి అనుకూలంగా ప్రకటనలు కూడా ఇచ్చాడని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా షినేట్ మీడియా సమావేశంలో ఆరోపించారు. ఎన్నికల ర్యాలీల్లోనూ పేటీఎంకు అనుకూలంగా మోదీ మాట్లాడారని, ఏడేళ్లుగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి సహకారం అందిందని, ఇప్పుడు కంపెనీపై ఆర్బీఐ ఆంక్షలు విధించిందని చెప్పారు. పేమెంట్ బ్యాంకులో అక్రమాలు జరుగుతున్నాయని ఆర్బీఐ ఆంక్షలు విధించిన తర్వాత కూడా ఈడీ ఎందుకు మౌనంగా ఉందని, మోదీకి సంబంధించిన వాళ్లపై దర్యాప్తు సంస్థలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు.

మనీశ్ సిసోడియాకు ఊరట



న్యూఢిల్లీ: మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు ఊరట లభించింది. మనీశ్ సిసోడియా ఏడాదిగా జైలు శిక్ష అనుభవిస్తున్నారు. తాజాగా వారానికి ఒకసారి అనారోగ్యంతో ఉన్న తన భార్యను, వైద్యులను కలవడానికి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆయనకు అనుమతి ఇచ్చింది. మనీశ్ తన భార్యను వారానికోసారి కలిసేందుకు కస్టడీ పెరోల్‌కు అనుమతించాలని ఢిల్లీ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగపాల్ ఫిబ్రవరి 2న మనీశ్ దరఖాస్తుపై (ఈడీ)కి నోటీసు జారీ చేశారు. అయితే మొదటి దరఖాస్తును సాధారణ బెయిల్‌గా... రెండో దరఖాస్తును కస్టడీ పెరోల్‌పై మనీశ్ వారానికి రెండు రోజులు తన భార్యను కలవడానికి అనుమతి ఇవ్వాలని కోర్టు ఈడీకి నోటీసు ఇచ్చింది.

63 మంది ఖైదీలకు హెచ్ఐవీ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో జిల్లా కారాగారంలో కలకలం రేగింది. జైలులో శిక్ష అనుభవిస్తున్న 63 మంది ఖైదీలకు హెచ్ఐవీ పాజిటివ్ నిర్ధారణ అయింది. డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షల్లో 36 మందికి హెచ్ఐవీ వైరస్ సోకినట్లు తేలగా... తాజాగా ఆ సంఖ్య మరింత పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, వైరస్ వ్యాప్తికి గల కారణాలపై స్పష్టత రాలేదు. వీరిలో చాలామందికి డ్రగ్స్ తీసుకునే అలవాటుందని, వాటిని శరీరంలోకి ఎక్కించుకునే క్రమంలో ఒకరు ఉపయోగించిన సిరంజీని మరొకరు వాడటం వల్లే ఈ వైరస్ వ్యాపించిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. వీరందరికీ ముందే హెచ్ఐవీ ఉందని, ఈ జైలులోకి వచ్చిన తర్వాత ఎవరికీ సంక్రమించలేదని చెబుతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో బాధితులందరికీ లక్నోలోని ఓ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు. వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లలో ఈ జైలులో ఇంతపెద్ద మొత్తంలో హెచ్ఐవీ కేసులు బయటపడటం ఇదే తొలిసారి. దీనికి గల కారణాలు గుర్తించేందుకు ప్రత్యేకంగా దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఒక్కసారిగా భారీ సంఖ్యలో కేసులు నమోదుకావడంతో ఇక్కడి మిగతా ఖైదీల ఆరోగ్యం, భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. కేసుల సంఖ్య పెరగకుండా వైద్యారోగ్యశాఖ సూచన మేరకు నియంత్రణ చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆధార్-పాన్ లింక్ చేయనందున

రూ.602 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: నిర్ణీత గడువులోగా శాశ్వత సంఖ్య పాన్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోని వారికి కేంద్రం రూ.1,000 చొప్పున అపరాధ రుసుం విధిస్తున్నది. దీని ద్వారా కేంద్రానికి ఇప్పటివరకు సమకూరిన ఆదాయం వివరాలను కేంద్ర ఆర్థికశాఖ సోమవారం వెల్లడించింది. గతేడాది జులై 1 నుంచి 2024 జనవరి 31 వరకు రూ.601.97 కోట్లు వసూలుచేసినట్లు తెలిపింది. ఆధార్-పాన్ అనుసంధానంపై లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మాలరాయ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పాన్‌తో అనుసంధానం కాని ఆధార్ కార్డుల సంఖ్య 2024 జనవరి 29 నాటికి దేశవ్యాప్తంగా 11.48 కోట్లు (మినహాయింపు వర్గాలు కాకుండా) ఉన్నట్లు చెప్పారు.

ట్యాక్సీ సర్వీస్‌లకు నిర్దిష్ట ఛార్జీలు

కర్నాటక ప్రభుత్వం ప్రకటన

బెంగళూరు: ట్యాక్సీ సర్వీస్ ధరలకు సంబంధించి కర్నాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓలా, ఉబర్ వంటి యాప్ ఆధారిత సంస్థలతో పాటు నాన్-యాప్ బేస్డ్ ట్యాక్సీ సర్వీస్‌లకు స్థిరమైన ఛార్జీలు అమలుచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం 'ఫిక్స్‌డ్ ఫేర్ రూల్' పేరుతో కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలు వినియోగదారుల నుంచి ఇష్టానుసారం ధరలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కర్నాటక రవాణా మంత్రిత్వశాఖ తెలిపింది. తక్షణం ఈ ధరలు అమల్లోకి వస్తాయని వెల్లడించింది. తాజా నిబంధనల ప్రకారం వాహనం ఖరీదు ఆధారంగా క్యాబ్ సర్వీస్‌లను మూడు భాగాలుగా విభజించింది. వాహనం ధర రూ.10 లక్షల కంటే తక్కువైతే.. మొదటి నాలుగు కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.100. తర్వాత ప్రతి అదనపు కి.మీ. రూ.24 చెల్లించాలని, కారు ఖరీదు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల మధ్య ఉంటే... కనీస ఛార్జీ రూ.115 కాగా, అదనపు కి.మీ రూ.28గా నిర్ణయించినట్లు తెలిపింది. వాహనం ధర రూ.15 లక్షలు దాటితే తొలి నాలుగు కి.మీ. కనీస ఛార్జీ రూ.130. తర్వాత ప్రతి కి.మీ. రూ.32 చెల్లించాలని, క్యాబ్ బుక్ చేసిన తర్వాత మొదటి ఐదు నిమిషాల వెయిటింగ్ ఉచితమని, తర్వాత ప్రతి నిమిషానికి ఒక రూపాయి ఛార్జీ వర్తిస్తుందని వెల్లడించింది. యాప్ ఆధారిత ట్యాక్సీ సర్వీస్‌ను అందించే సంస్థలు ఐదు శాతం జీఎస్టీతోపాటు టోల్ ఛార్జీలు వసూలు చేసేందుకు అనుమతించారు. రాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య క్యాబ్ సర్వీస్‌లు అందించే సంస్థలు సాధారణ ధరలకు అదనంగా పది శాతం వసూలు చేసుకోవచ్చని తెలిపింది.

మిగిలిన సెల్లార్లలోనూ ఏఎస్ఐ సర్వే చేపట్టాలి



లక్నో: జ్ఞానవాపి కాంప్లెక్స్‌లో మిగిలిన సెల్లార్‌లను సర్వే చేసేందుకు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)కి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హిందూ పిటిషనర్ వారణాసిలోని విచారణ కోర్టును ఆశ్రయించారు. కాంప్లెక్స్ మతపరమైన స్వభావాన్ని నిర్ధారించడానికి ఈ సెల్లార్‌లను సర్వే చేయడం చాలా కీలకమని పిటిషనర్ పేర్కొన్నారు. ప్రవేశానికి అనుమతి లేని మిగిలిన సెల్లార్లలో సర్వే చేపట్టవలసిందిగా పిటిషనర్ ఏఎస్ఐని అభ్యర్థించారు. వీటితోపాటు జ్ఞానవాపి ఆవరణలో ఇటీవల సర్వే సమయంలో దర్యాప్తు చేయని సెల్లార్ల సర్వేలను నిర్వహించాలని ఏఎస్ఐని కోరారు. ఏ సర్వే నిర్వహించినా నిర్మాణానికి నష్టం జరగకుండా చూడాలని విన్నవించారు. కొన్ని ఇటుకలు, రాళ్లతో ఉన్న అడ్డంకుల కారణంగా ఏఎస్ఐ సర్వే కొన్ని సెల్లార్లలో పూర్తి కాలేదని పేర్కొన్నారు. నిర్మాణానికి హాని కలిగించకుండా ఈ అడ్డంకులను సురక్షితంగా తొలగించడానికి అవసరమైన నైపుణ్యాలను ఏఎస్ఐ నిపుణులు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అడ్డంకుల తొలగింపుపై ఏఎస్ఐ నివేదిక పొందాలని అభ్యర్థించారు.

రిజర్వేషన్ల పేరుతో మహిళలకు బీజేపీ దగా

అనీ రాజా

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీకి నిజంగా మహిళలపై గౌరవం ఉంటే... మహిళలకు రిజర్వేషన్లు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనీరాజా డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల పేరుతో మహిళలను బీజేపీ మోసం చేస్తోందన్నారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి అనీ రాజా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రధాన రూపశిల్పి అప్పటి సీపీఐ పార్లమెంట్ సభ్యురాలు గీతా ముఖర్జీ అని చెప్పారు. ముసాయిదా రూపకల్పనలో ఆమె కీలక పాత్ర పోషించారన్నారు. అనేక సార్లు పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదం కోసం ప్రవేశపెడితే... ఆర్ఎస్ఎస్ అనుకూల ఎంపీలు అడ్డుకున్నారన్నారు. నాటి నుండి నేటివరకు ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు మహిళలను మోసం చేస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. మణిపూర్‌లో ఘోర మానవ విషాదం చోటు చేసుకోవడానికి కారణం కేంద్ర, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలేనని తెలిపారు. గత కొన్ని నెలలుగా మణిపూర్ లో జరుగుతున్న హింసను, హత్యలను, అత్యాచారాలను అరికట్టి... శాంతిని పునరుద్ధరించడంలో మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని చెప్పారు. ఎలాంటి రక్షణ లేకుండా సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్న మహిళలు, చిన్నారుల పరిస్థితిపై తీవ్ర ఆందోళన ఆమె వ్యక్తం చేశారు. నయా ఫాసిస్ట్ మోదీ పాలనలో దేశంలో మత సహనం క్షీణించిందని, మత స్వేచ్ఛ ఉల్లంఘనలు అంతులేకుండా పెరిగిపోవడం ప్రమాదకరం అని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో దేశంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని... మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ చాంపియన్‌లైన భారత మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడడం ఇందుకు నిదర్శనం అని తెలిపారు. ఉద్యోగాల కోసం వెతుకుతున్న మహిళల సంఖ్య తగ్గుతోందని, మోదీ ప్రభుత్వ తిరోగమన విధానాలు మహిళలను ఇళ్లకే పరిమితమయ్యేలా చేస్తున్నాయన్నారు. హక్కులు, గౌరవం, న్యాయం, సమానత్వం కోసం ఉక్కు సంకల్పంతో మహిళా ఉద్యమాలను నిర్మించాలని అనీరాజా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు పీ దుర్గా భవాని, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పీ ప్రేమ్‌పావని, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం సదాలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎస్ ఛాయాదేవి, ముదుపు నళిని, బీ జంగమ్మ, ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సహాయ కార్యదర్శి ఫైమీద, కార్యవర్గ సభ్యులు పడాల నళిని, హైమావతి, మల్లేశ్వరి, సమ లక్ష్మి, రొయ్యల గిరిజ, కే మల్లవ్వ, పద్మ, మంజుల, సాంబ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో యువశక్తి నిర్వీర్యం

- రాజ్యాంగ హక్కులను హరించారు
- 'మోదీ హఠావ్ - దేశ్ బచావో' నినాదంతో దేశవ్యాప్త ప్రచారం
- ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

విశాలాంధ్ర-హైదరాబాద్: రాజ్యాంగ హక్కులను హరిస్తున్న కేంద్రంలోని నరేంద్రమోదీ పాలనకు వ్యతిరేకంగా 'మోదీ హఠావ్ - దేశ్ బచావో' నినాదంతో దేశమంతటా ప్రచారం నిర్వహించనున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ తిరుమలై రామన్ పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ లో రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లా ఖాద్రీ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుమలై రామన్ మాట్లాడుతూ యువతరం దేశానికి ఇంధనం, ప్రగతికి రథచక్రం లాంటిదన్నారు. చరిత్రలో ఏ మార్పు సంభవించినా అది ఉరకలెత్తే యువతవల్లే సాధ్యమని పేర్కొన్నారు. అలాంటి యువశక్తి నిర్వీర్యమవుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 16 శాతం నిరుద్యోగం పెరిగిందన్నారు. చదువుకు తగ్గ ఉద్యోగాలులేక యువత నానా అవస్థలు పడుతున్నారన్నారు. నిరుద్యోగ యువత రోజురోజుకు పెరుగుతోందని, ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలన్న మోదీ... యువతను నిలువునా మోసం చేశారన్నారు. పైగా లక్షలాది పరిశ్రమలు మూతపడి కోట్లాదిమంది ప్రజలు ఉన్న ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డారని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా' అనేది నినాద ఆర్భాటమే తప్ప ఒక్క తయారీ కర్మాగారాన్ని పెట్టలేదన్నారు. డిజిటల్ ఇండియా, 'బేటి బచావో- బేటి పడావో' తదితరాలు శుష్క వాగ్దానాలుగా మిగిలిపోయన్నారు. భావ స్వేచ్ఛను, ప్రాథమిక హక్కులను హరించి మోదీ పాలన సాగించారన్నారు. దళితులు, మైనారిటీలపై హిందూ మత ఉన్మాద దాడులతో చట్టాలను తమ చేతుల్లో తీసుకొని హింసకు పాల్పడ్డారన్నారు. మోదీ ప్రభుత్వం రాజకీయ పార్టీల పై చేస్తున్న కక్ష సాధింపు చర్యలను దేశ ప్రజలంతా తిప్పికొట్టాలన్నారు. విభజించు పాలించు అనే నినాదంతో పబ్బం గడపాలనే మోదీ దుష్ట నీచ రాజకీయాలకు, మత రాజకీయాలకు వ్యతిరేకంగా భారతదేశ యువత ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కే ధర్మేంద్ర మాట్లాడుతూ... ప్రధాని మోదీ... విదేశాల నుంచి నల్లధనం బయటకు తీసుకురాకపోగా, దేశ సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయాలు, సైనిక్ స్కూల్స్ వంటి హామీలు అమలు కాలేదన్నారు. విభజన హామీల అమలుకు దిక్కులేదు. కనీసం వీటినైనా నిర్మించి ఉంటే ఈపాటికి వేలాది మందికి ఉపాధి లభించి ఉండేది. ఉద్యోగాల గురించి అడిగితే బజ్జీలు, పకోడీలు అమ్ముకోండని అమిత్ షా యువతను హేళన చేస్తూ ఉచిత సలహాలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలను, రాజకీయ పార్టీల ప్రచారాలలోని వాస్తవాలను యువత అవగతం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మహేందర్, శ్రీమాన్, యుగంధర్, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, ఉపేందర్, మహేష్, శ్రీనాథ్ రెడ్డి, రవి, శ్రీనివాస్, సుధీర్,రవి కుమార్, నయీమ్ లతో పాటు 40మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఈపీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ శ్రీరంగరాజ్ పిలుపు

విశాలాంధ్ర-హైదరాబాద్: అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసే, నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్‌శ్రీరంగరాజ్ పిలుపునిచ్చారు. మోదీ సర్కారు తీసుకొచ్చి జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)కు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా ఐదు కోట్ల సంతకాల సేకరణ చేపట్టింది. ఇందులో భాగంగా మేడ్చల్ జిల్లా కేంద్రంలోని ఉప్పల్ డిపో వద్ద వివిధ కళాశాలల విద్యార్థులతో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దినేశ్ మాట్లాడుతూ... విద్య కాషాయీకరణ, విద్యా ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యా విధానాన్ని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఎన్ఈపీని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తిరస్కరించాలని కోరారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చారని విమర్శించారు. విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణ చేయాలని కేంద్రం యత్నిస్తోందన్నారు. ఎన్ఈపీ అమలు వల్ల దాదాపు 90% విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారన్నారు. విద్యా వ్యాపారీకరణ వలన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం దూరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వానికి బదులు హిందుత్వ రాజ్యాన్ని స్థాపించడానికి మోదీ సర్కారు యత్నిస్తోందన్నారు. ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో ప్రైవేటు విశ్వ విద్యాలయలను, విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తారని తెలిపారు. ఇప్పటికే పేద వర్గాలకు అందని ద్రాక్షగా మారిన విద్య... ఎన్ఈపీ అమలుతో విద్యకు మరింత దూరం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఈపీకి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గ్యార క్రాంతి, గ్యార నరేష్ , రెహమాన్ , నెల్లి సత్య ,మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్ , ఉపాధ్యక్షుడు హరీష్, జిల్లా నాయకులు గోపి , అరవింద్, శివ, రాము, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

అన్నీ అసత్యాలే

గవర్నర్ ప్రసంగంపై టీడీపీ సభ్యుల నిరసన... వాకౌట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని సోమవారం ఉభయసభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ సభ్యులు వాకౌట్ చేశారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా వివిధ అంశాలపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సార్..మీతో రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాలు చెప్పిస్తోందంటూ అరుస్తూ నిరసన వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రాలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ప్రసంగ పాఠంలో పేర్కొన్న అంశాలన్నీ అబద్ధాలేనని విమర్శించారు. అమ్మఒడి కొంతమందికే ఇస్తున్నారని, ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు కాకుండా వైసీపీ నేతలకు ఇచ్చారని ఆరోపించారు. అంగన్వాడీలకు జీతాలు పెంచకుండా అన్యాయం చేశారని అన్నారు. విద్యార్థులకు పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశామని గవర్నర్ చెప్పడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ కాదు...దగా డీఎస్సీ అంటూ నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా ఎక్కడ, రైల్వే జోన్ ఎక్కడ అంటూ ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు ఎంతవరకు వచ్చిందని నిలదీశారు. ఇలా అనేక అంశాలపై గవర్నర్ ప్రసంగిస్తుండగా, టీడీపీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. షేమ్ షేమ్ అంటూ నినాదాలు చేశారు. దీనికి కౌంటర్‌గా అధికారపార్టీ సభ్యులు కొందరు ప్రతి నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అయినప్పటికీ టీడీపీ సభ్యుల నినాదాల మధ్యే గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఆ తర్వాత టీడీపీ సభ్యులు ప్లకార్డులు చేతబూని వారి స్థానాల్లో కొద్దిసేపు నిలబడి నినాదాలు చేశారు. అనంతరం గవర్నర్ ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ వాకౌట్ చేశారు. అసెంబ్లీ లాబీలోనూ సభ్యులు కొద్దిసేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.

తప్పుల తడకగా ఉన్నందునే వాకౌట్: టీడీపీ

బయటకు వచ్చిన అనంతరం టీడీపీ సభ్యులు మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం శాసనసభ పక్ష ఉపనేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం తప్పుల తడకగా ఉందని, అందుకే సభను బహిష్కరించామన్నారు. గోబెల్స్ ప్రచారంతో 36 పేజీల ప్రసంగాన్ని మసిపూసి మారేడుకాయ చేశారని, ప్రభుత్వం అబద్ధాలు చదవటానికి గవర్నర్ కూడా చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఐదేళ్ల ప్రభుత్వ వైఫల్యాలకు గవర్నర్ ప్రసంగం అద్దం పడుతోందని బుచ్చయ్య చౌదరి విమర్శించారు. తెలుగుదేశం శాసనసభ పక్ష ఉపనేత నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో చెప్పిన అబద్ధాలు లాంటివే గవర్నర్‌తో పలికించారన్నారు. అబద్ధాలను కూడా నిస్సిగ్గుగా చెప్పటం జగన్‌కే చెల్లిందన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలను మోసగించటానికి గవర్నర్‌ను వాడుకోవడం దుర్మార్గమన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

నీటికుంటలో పడి ముగ్గురు చిన్నారుల మృతి

విశాలాంధ్ర-పాకాల: సరదాగా ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడిన విషాదఘటన తిరుపతి జిల్లా పాకాల మండలంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి సీఐ రాజగోపాల్ తెలిపిన వివరాల మేరకు పాకాల మండలం దామలచెరువు గ్రామ పంచాయతీ ఊటువంక గ్రామానికి చెందిన శేఖర్, జ్యోతి దంపతుల కుమారుడు తేజేశ్వర్ (10), రామకృష్ణ, విజయలక్ష్మి దంపతుల కుమారులు పునీత్ కుమార్ (11), కన్నయ్య(9) ఊటువంక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. వారు సాయంత్రం పాఠశాల ముగిసిన వెంటనే ఆడుకుంటూ సమీపంలోని పచ్చిపాల ఓబన్న నీటి కుంట వద్దకు వెళ్లారు. ఈత కొట్టాలనే సరదాతో ముగ్గురు చిన్నారులు నీటిలో దిగి లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక మునిగిచనిపోయారు. దీనిని గమనించిన స్థానికులు కేకలు వేయడంతో గ్రామస్తులు కుంట వద్దకు చేరుకొని చిన్నారుల మృతదేహాలను వెలికి తీశారు. చిన్నారులు విగత జీవులుగా మారడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల తల్లిదండ్రులు బోరున విలపించారు. పాకాల సీఐ రాజగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ టెస్టులో మనదే విజయం

- 106 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసిన భారత్
- 5మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమం

విశాఖపట్నం: ఇక్కడి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన ండో టెస్టు మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఘన విజయం సాధించింది. 106 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. భారత్ నిర్దేశించిన 399 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 292కే కుప్పకూలింది. జాక్ క్రాలీ (73 పరుగులు) మినహా మిగతావారెవరూ రాణించలేదు. ఓవర్‌నైట్ స్కోర్ 67-1తో నాలుగోరోజు సోమవారం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. రెహాన్ అహ్మద్ (28), ఒల్లీ పోప్ (23), జో రూట్ (16), జాని బెయిర్‌స్టో (26), క్రాలీ (76) తొలి సెషన్‌లోనే ఔటయ్యారు. దీంతో భారత్ విజయావకాశాలు మెరుగుపర్చుకుంది. అయినప్పటికీ ఇంగ్లాండ్ దూకుడుగా ఆడి పరుగులు సాధించింది. ఇక చివర్లో బెన్ ఫోక్స్ (36), టామ్ హార్లీ (36) కాసేపు పోరాడి, ఓటమి అంతరాన్ని తగ్గించగలిగారు. ఇక టీమ్‌ఇండియా బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 3, రవిచంద్రన్ అశ్విన్ 3, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, ముకేశ్ కుమార్ తలో వికెట్ దక్కించుకున్నారు. ఇక రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన పేసర్ బుమ్రాకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంలో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. ఇరుజట్ల మధ్య మూడో టెస్టు మ్యాచ్ ఫిబ్రవరి 15నుంచి రాజ్‌కోట్ వేదికగా జరగనుంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 396-10 భారీ స్కోర్ నమోదు చేసింది. యువ బ్యాటర్ యశస్వి జైశ్వాల్ (209) డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. అనంతరం ఇంగ్లాండ్ 253 పరుగులకే కుప్పకూలింది. జాక్ క్రాలి (76) మినహా మిగతా బ్యాటర్లు ఆకట్టుకోలేదు. ఈ ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా స్టార్ పేసర్ బుమ్రా 6 వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 255 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో మరో యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (104) సెంచరీతో ఆకట్టుకున్నాడు.

ఇరుజట్ల స్కోర్లు:

భారత్ తొలి ఇన్నింగ్స్- 396/10
ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్- 253/10
భారత్ రెండో ఇన్నింగ్స్- 255/10
ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్- 292/10

శుభ్‌మన్‌కు గాయం: కీలక ఆటగాళ్లు గాయాలబారిన పడటంతో సతమతమవుతున్న టీమ్‌ఇండియాకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే గాయాలతో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా జట్టుకు దూరమవ్వగా ఇప్పుడు శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆటలో గిల్ కుడి చూపుడు వేలికి గాయమైనట్లు తెలిసింది. ఓ వైపు చేతి వేలి నొప్పితో బాధపడుతూనే అతడు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో సత్తా చాటాడు. అయితే ఇప్పుడా నొప్పి ఎక్కువ అవ్వడంతో నాలుగో రోజు ఫీల్డింగ్‌కు దూరమయ్యాడు. ఈ విషయాన్ని బీసీసీఐ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. గాయపడిన గిల్ మళ్లీ మైదానంలోకి ఎప్పుడు అడుగుపెడతాడో ప్రస్తుతానికి చెప్పలేని స్థితి. గాయంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

అబద్ధాల పుట్ట

గవర్నర్ ప్రసంగంపై రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: తాను అబద్ధాలు వల్లె వేయడమే కాకుండా గవర్నర్‌తోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాలు చెప్పిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఏపీ అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగంపై రామకృష్ణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యాసంస్కరణలు చేపట్టామని చెప్పడం బోగస్ అన్నారు. దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి తరలిపోయారంటే విద్యా రంగం ఏ మేరకు కుంటుపడిందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేసుల్లో కూరుకుపోయిన వివాదాస్పదమైన బైజూస్ కంపెనీకి వందల కోట్ల ప్రభుత్వ ధనం దోచి పెట్టారని ఆరోపించారు. నీటిపారుదల రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలిపారు. గండికోట ప్రాజెక్టులో 27 టీఎంసీల నీటిని నిల్వ చేసినప్పటికీ ఒక్క ఎకరా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదన్నారు. ప్రాజెక్టు కింద కాలువలు తవ్వలేదని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడం వల్ల అన్నమయ్య, ఫించా ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకు పోయాయన్నార. ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. గత నాలుగున్నర ఏళ్లలో దాదాపు రూ.57 వేల కోట్ల విద్యుత్ భారాలను ప్రజలపై మోపారని చెప్పారు. విశాఖలో జరిగిన సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ చెబుతున్నారని, అసలు ఆ పెట్టుబడులు ఎక్కడ వచ్చాయి... ఏఏ పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయని ప్రశ్నించారు. అంతర్జాతీయ విద్య పేరుతో విద్యార్థులను గందరగోళంలోకి నెట్టారని దుయ్యబట్టారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చినా, అవి బల్లలు, సున్నాలకే పరిమితమైందన్నారు. ఉపాధ్యాయులు ఉంటేనే పాఠశాలలకు నిండుదనం ఉంటుందన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీతో పాఠశాలలు వెలవెలబోతున్న వాస్తవాన్ని ఎందుకు చెప్పలేదని నిలదీశారు. పైగా మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి...ఇప్పుడు ఎన్నికల ముందు కేవలం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను దగా చేశారని విమర్శించారు. అమ్మఒడి, విద్యాకానుక పథకాల్లో కోతలు నేటికీ విద్యార్థుల తల్లులను వేధిస్తున్న సమస్యగా ఉందన్నారు. పైగా కొన్ని విడతలను ఎగ్గొట్టి మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. 1వ తరగతి నుంచే ఐటీ విధానమంటూ సరికొత్త మోసానికి తెరతీస్తున్నారని, సిబ్బంది, నియామకాలు లేకుండా, ఎక్విప్‌మెంట్ లేకుండా డిజిటల్ విధానం ఎలా వస్తుందో అర్థం కావడం లేదన్నారు. కొత్త ఆసుపత్రులు, సౌకర్యాల మెరుగుదల అనేది పెద్ద దగా అన్నారు. ఇంటి వద్దనే వైద్యసేవలు తూతూమంత్రంగా ముగించేశారని తెలిపారు. రాష్ట్రంలో ఐటీ రంగం ఏనాడో జీరో అయిందన్నారు. పర్యాటకులు పెరిగినా, పర్యాటక స్థలాల్లో సౌకర్యాలు లేక సందర్శకులు ఇబ్బందులు పాలవుతున్నారని పేర్కొన్నారు. ఈ రంగంలో పెట్టిన పెట్టుబడులు మొత్తం మంత్రి, సంబంధిత అధికారులు స్వాహా చేసిన అంశం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ రంగంలో 7,290 మందికి ఉపాధి కల్పించేలా రూ.3,685 కోట్ల పెట్టుబడి పెట్టామని చెప్పడం మరో తప్పుడు లెక్క అని ధ్వజమెత్తారు. భూ హక్కుల చట్టం పేరుతో ప్రజలను మోసం చేయడం దారుణమన్నారు. ఇవన్నీ వదిలేసి, గవర్నర్ నోటితో అబద్ధాలు చెప్పించడం అన్యాయమన్నారు. ఇది ఎన్నికల ముందు ప్రజలకు వెన్నుపోటు పొడవడమే అవుతందని రామకృష్ణ విమర్శించారు.

రేపు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

8 వరకు అసెంబ్లీ సమావేశాలు

బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈనెల 8 వరకు జరగనున్నాయి. ఈ మేరకు స్పీకర్ తమ్మినేని సీతారామ్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం స్పీకర్ తమ్మినేని నేతృత్వంలో బీఏసీ సమావేశమైంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, జోగి రమేశ్ తదితరులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. శాసనమండలిలో గత ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రవేశపెట్టే అవకాశం ఉందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. బీఏసీ సమావేశాన్ని టీడీపీ బహిష్కరించింది. ఈనెల 6వ తేదీన గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగనుండగా, 7న బడ్జెట్, 8న దానిపై చర్చతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి.

తహసీల్దార్ హత్య కేసులో హంతకుడి అరెస్ట్

విశాఖలో నిందితుడ్ని పట్టుకున్న విశాఖ పోలీసులు

హత్యకు కారణాలు వెల్లడించని సీపీ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: రాష్ట్రంలో సంచలనం రేపిన తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడ్ని చెన్నై పోలీసుల సహకారంతో అరెస్ట్ చేసినట్లు విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ రవిశంకర్ తెలిపారు. సోమవారం సాయంత్రం కమిషనర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం అలియాస్ గంగా రావును అరెస్ట్ చేసి సోమవారం ఉదయం విశాఖ తీసుకొచ్చామని తెలిపారు. పేరు పెద్దగా ఉండటం వల్ల విమానాశ్రయంలో మిస్ కమ్యునికేషన్ అయ్యిందని, ఎయిర్ పోర్టులో సుబ్రమణ్యం అని అడిగితే అలాంటి ప్రయాణికుడు ఎవరూ లేరని చెప్పారన్నారు. చెన్నై వెళ్లాల్సిన హంతకుడు హఠాత్తుగా బెంగుళూరులో దిగిపోయాడని, అక్కడి నుంచి బస్సులో చెన్నై వెళ్లాడన్నారు. చెన్నై నుంచి చెంగల్ పట్ వెళుతుండగా అరెస్ట్ చేశామన్నారు. అయితే హత్యకు గల కారణాలను వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కేవలం నిందితుడ్ని పట్టుకున్నాం, అరెస్ట్ చేశామని మాత్రమే సీపీ వెల్లడించారు. తహసీల్దార్ హత్య కేసులో నిందితుడైన మురారి సుబ్రహ్మణ్యం అలియాస్ గంగారావు స్వచ్ఛందంగా లొంగి పోవడానికి విశాఖ వస్తూనే పోలీసులకు దొరికిపోయినట్టు విశ్వసనీయ సమాచారం. శుక్రవారం రాత్రి రమణయ్యపై దాడి చేసి వెళ్లిపోయిన గంగరావు ఆ రాత్రంతా విశాఖలోనే ఉన్నాడని, రాడ్‌తో కొట్టిన తరువాత రమణయ్య చనిపోతాడనుకోలేదని... తెల్లారి పోలీసులకు లొంగిపోవటానికి సిద్ధం కాగా, శనివారం ఉదయం రమణయ్య చని పోయినట్టు వార్తలు రావడంతో వెంటనే బయలుదేరి విమానంలో బెంగళూర్ వెళ్లిపోయినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. అక్కడి నుంచి విశాఖ పోలీసులకు లొంగిపోవడానికి ఎగ్మూరు రైల్వేస్టేషన్ కు చేరుకోగా... ఈలోగా సెల్ టవర్ ఆధారంగా పోలీసులు గంగారావు ఆచూకీని తెలుసుకున్నారని, చెన్నై శివారు ప్రాంతాల్లో అరెస్టు చేసి విశాఖ కు ఆదివారం రాత్రే తరలించారని సమాచారం. కన్వేయన్స్ డీడ్ జారీలో డబ్బులు తీసుకున్నా పని చేయకపోవడం వల్లే తహసీల్దార్‌పై దాడికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిసింది. అయినా పోలీసులు అధికారికంగా ఈ హత్యకు గల కారణాలను వెల్లడించకపోవడం విశేషం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.